జూన్, 2001


# నేతన్న

రాజకీయ త్రైమాస పత్రిక

గ్లోబల్ మార్కెట్ కాదు - స్థానిక మార్కెట్

సిరిసిల్లా - దుబ్బాకల వైరుధ్యం


చేనేత సంక్షోభానికి పరిష్కారం ?



రాజకీయ త్రైమాస పత్రిక

# నేతన్న

జూన్ 2001 బులిటిన్ - 4




సంపాదకుడు
మాచర్ల మోహనరావు

సంపాదకవర్గం
డి. రామక్రిష్ణ
తడ్క యాదగిరి
కె. నాగభూషణం
డి. సుశీల

ప్రచురణ - ముద్రణ
మాచర్ల మోహనరావు

కవర్ ఫోటో :
భరత్ భూషణ్ .జి

ముద్రణ :
ప్లానోగ్రాఫర్స్
చిరాగ్ అలీ లేన్,
హైదరాబాద్ - 500 001

వెల : రూ. 5/-

సంవత్సర చందా : రూ. 30/-

చందాలు / రచనలు పంపాల్సిన అడ్రస్:
పి. రాజ్యలక్ష్మీ
వర్కింగ్ ఎడిటర్, నేతన్న
16-9-32/ఎ/1, ఓల్డ్ మలక్‌పేట,
హైదరాబాద్ - 500 036


## విజ్ఞప్తి

చేనేత కార్మికులారా!

మీ ప్రాంతంలోని చేనేత రంగ సమస్యలను, పరిస్థితులను, మీ పోరాటాల రిపోర్టులను నేతన్న పత్రికకు పంపండి! పాటలు కవితలు, వ్యాసాలు, వార్తలు పై చిరునామాకు పంపించండి.

## ఈ సంచికలో ......


| | పేజి. నెం. |
|---|---|
| 1. సంపాదకీయం<br>గ్లోబల్ మార్కెట్ కాదు స్థానిక మార్కెట్ కై పోరాడండి | 3 |
| 2. సిరిసిల్ల - దుబ్బాకల వైరుధ్యం - పరిష్కారం<br>- మాచర్ల మోహనరావు | 4 |
| 3. చేనేత సంక్షోభానికి పరిష్కారం ఏమిటి?<br>- ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు | 6 |
| 4. చేనేత, మరమగ్గాల సంక్షోభం - పరిశీలన<br>- కె. జె. రామారావు | 9 |
| 5. విజయవంతమైన జిల్లా సదస్సులు | 12 |
| 6. చేనేత రంగం - దాని ప్రాధాన్యత ఉపాధి అవకాశాలు<br>- మాచర్ల మోహనరావు | 14 |
| 7. చేనేత కార్మికులకు మొండిచేయి చూపిన అఖిలభారత పద్మశాలి మహాసభ<br>- తడ్క యాదగిరి | 20 |
| 8. కొత్త సీసాలో పాత మందు<br>'దీన్‌దయాల్ హాత్ కార్ ఘా యోజన పథకం'<br>- డి. కల్పన కుమారి | 22 |
| 9. ఈ మాసపు కవిత - సమాధులకీ భాష వుంది<br>- పున్న సుదర్శన్ | 23 |
| 10. జిల్లా సదస్సుల ఫోటోలు | 24 |


### అభిప్రాయాలు రాయండి

నేతన్న పత్రిక లక్ష్యసాధనలో మీరు భాగస్వాములు కావాలని కోరుతున్నాము నేతన్న పత్రికపై నిష్పక్షపాతమైన అభిప్రాయాలు తెలిపి పత్రిక మరింత ప్రయోజనకరంగా వెలువడేందుకు తోడ్పడండి!నేతన్న పత్రికలోపల అంశాల ఏవిధంగా ఉంటే కార్మికులకు ఉపయోగపడతాయో తెలియపర్చండి! చేనేత కార్మికోద్యమానికి మీ వంతు సహకారం అందించండి!

- ఎడిటర్

# సంపాదకీయం

## గ్లోబల్ మార్కెట్ కాదు - స్థానిక మార్కెట్ కోసం పోరాడండి !

ఆంధ్రప్రదేశ్‌లో మరమగ్గం, చేనేత రంగాల సంక్షోభం తీవ్రమై 80 మందికి పైగా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే వివిధ రాజకీయ పార్టీలు పంచాయితీ ఎన్నికల పుణ్యమా అని నేత కార్మికుల సమస్య గూర్చి జాతీయ స్థాయీ చర్చ చేసాయి.

రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా చేనేత రంగం చిక్కి శిథిల మవుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ' ఆధునికత' రాగాన్ని ఆలపిస్తున్నాయి.

జబ్బొకటయితే చికిత్స ఇంకొకటిలాగా టెక్నాలజీ అప్ గ్రేడేషన్ స్కీం కింద మరమగ్గాలను ఆధునీకరించాలని, చేనేత మగ్గాల స్థానంలో సెమీ ఆటోమేటిక్ మగ్గాలు పెట్టాలని, ఉత్పాదకత పెంచాలని, చేనేత వస్త్రాలను విదేశాలలో, విక్రయించేందుకు దేశ వ్యాప్తంగా టెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేసేందుకు ఈ సంవత్సరం బడ్జెట్లో 10 కోట్లు కేటాయించామని విదేశాలలో విక్రయించే విధంగా క్వాలిటీని పెంచి నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని సిరిసిల్లా సందర్శించిన కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి ధనుంజయ కుమార్ ప్రకటించారు. ఇదే సందర్భంగా పొరుగు రాష్ట్రం తమిళనాడులో చేనేత రంగానికిస్తున్న రక్షణలు, సహకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇవ్వకపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని చర్చకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనవంతు సహకారం ఇస్తే కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన సెలవిచ్చారు.

ఈనాటి సమస్యకు మూలకారణమైన కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు, విద్యుత్ చార్జీలు మార్కెట్ సమస్యలను చర్చించకుండా దాట వేసి విదేశాలలో చేనేత వస్త్రాలను విక్రయించే ఏర్పాటు చేస్తామని ప్రకటించడమంటే కోట్లాది మందికి ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమ అయిన చేనేత రంగం ఎడల పాలకుల నిర్లక్ష్య వైఖరికి అది అద్దం పడుతుంది

అంతర్జాతీయంగా చేనేత వస్త్రాల ఎగుమతులలో చైనా, పాకిస్థాన్, ఈజిప్టు, టర్కీ దేశాలు భారత దేశంకన్నా 5 నుండి 10 శాతం తక్కువ ధరలకు సరఫరా చేస్తున్నందున భారత దేశ ఎగుమతులు గత 3 సంవత్సరాలలో 1100 కోట్ల నుండి 1000 కోట్లకు పడిపోయాయి.

ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని బలహీనమయిన ప్రభుత్వం స్థానిక పరిశ్రమలకు సహకారం ఇవ్వకుండా పన్నులు వేసి, బహుళజాతి కంపెనీలకు పూర్తి స్థాయిలో పన్నురాయితీలు కల్పించి స్థానిక మార్కెట్‌ను దారాదత్తం చేసే ప్రభుత్వాలలో ప్రపంచంలో మనదేశం మొదటి శ్రేణిలో నిలుస్తుంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు నారి దేశీయ ఉత్పత్తులకు అన్ని రకాల రక్షణలు కల్పించి అంతర్జాతీయ మార్కెట్లో పోటీ పడుతుంటే, ఉన్న రక్షణలు తొలగించి అన్ని సమస్యలకు విదేశీ మార్కెట్ శరణ్యం కనుక ఆధునీకరించాలని మరింత నష్టం కలిగించే చర్యలను ప్రతిపాదిస్తున్నారు.

ఈ నేపథ్యంలో స్థానిక మార్కెట్‌ను నిలబెట్టుకునేందుకు విదేశీ వస్త్రాలను, మిల్లు ఉత్పత్తులను నిరోధించాలని, ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో చేనేత ఉత్పత్తులకు పూర్తి రిజర్వేషన్ కల్పించాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ, మార్కెట్ కేంద్రాలలోనూ ఉచిత షాపింగ్ సౌకర్యం కల్పించడం, బహుళజాతి, మిల్లు, ఉత్పత్తులపై అధిక పన్నులు వేసి చేనేత మార్కెట్ పరిరక్షణకు చర్యలు తీసుకోవడం, చేనేత వస్త్రాలపై, అన్ని రకాల పన్నులు రద్దుచేయాలని, చేనేత రంగంలో ముడిసరుకులు, రంగులు, రసాయనాలపై అన్ని రకాల పన్నులు రద్దు చేసి సరసమైన ధరలకు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై వత్తిడి తేవాలి.

అభివృద్ధి చెందిన దేశాలలాగే మనదేశం కూడ స్థానిక ఉత్పత్తులైన చేనేత వస్త్రాలకు అన్ని రకాల రక్షణలు కల్పించేందుకు వివిధ వర్గాల ప్రజలతో కలిసి స్థానిక మార్కెట్‌పై పట్టుకొరకు రాజకీయ పోరాటానికి సమాయత్తం కావాలని రాష్ట్ర మహాసభల సందర్భంగా నేతన్నలకు రాష్ట్ర చేనేత కార్మిక సమాఖ్య పిలుపునిస్తోంది.

☆

# సిరిసిల్ల - దుబ్బాకల వైరుధ్యం - పరిష్కారం

జాతీయ జౌళి విధానం -2000 అమలు తరువాత జరిగిన సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికుల ఆత్మహత్యలు మానవజాతిని విస్మయంలోకి నెట్టాయి. విస్మయంలోకి నెట్టడమే కాక మనదేశ జౌళిరంగానికి పెను సవాళ్ళుగా తయారయ్యాయి. రాజకీయ పార్టీలు కూడ చేమగ్గాన్ని, మరమగ్గాన్ని ఒకే రకంగా చూస్తూ, ఈ రెండురంగాల మధ్య ఉన్న తేడాను గుర్తించకపోవటం వలన చేనేత రంగానికి మరొక ఉపద్రవం ముంచుకొస్తున్నట్లుగా చేనేత వర్గం గుర్తించాలి. పవర్‌లూమ్ కార్మికులు ఆత్మహత్యలకు గురికాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వానికి, ఈ సమాజానికి ఉంది. ఒక్క జౌళి రంగంలోనే కాకుండా ఇతర రంగాలలో జరుగుతున్నటువంటి ఆత్మహత్యలకు, ఆకలి చావులకు మనమంతా బాధ్యత వహించాలి. ఈ సందర్భంలోనే ఒకరి హక్కులను మరొకరు హరించకుండా "బలవంతుడిదే రాజ్యం కాకుండా" చూడవలసిన బాధ్యత ఈ సమాజానిది, ప్రభుత్వానిది. ఈ అంశానికి సంబంధించినదే పవర్‌లూమ్స్ పై చేనేత ఉత్పత్తులను తయారు చేయడం అనేది.

ఇప్పటివరకు చేనేత ఉత్పత్తులను కాలరాస్తూ ఉపాధి పొందుతున్న పవర్‌లూమ్ కార్మికులు ఒక్కసారిగా (పెనురక్కసి)లా మీద పడిన విదేశి పోటికి తట్టుకోలేక (జెట్‌లూమ్స్) దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జౌళిరంగ సంక్షోభాన్ని విశ్లేషించకుండా, జౌళిరంగంలో ఉన్నటువంటి, పవర్‌లూమ్, హ్యాండ్‌లూమ్, కాంపోజిట్ మిల్‌లను ఒకే దృష్టితో చూసి పరిష్కార మార్గాలను సూచించటమనేది ఈ రంగాన్ని మరింత సంక్షోభానికి గురిచేయటమే గాక కోట్లాది ప్రజల జీవనోపాధిని హరింపచేయటం, నిరుద్యోగాన్ని పెంపొంధించడం మాత్రమే.

మనదేశంలో కోట్లాది ప్రజలకు జీవనోపాధిని కల్పిస్తున్న రంగాన్ని నశింపచేసి వేలమందికి మాత్రమే ఉపాధి చూపించే సాంకేతికాభివృద్ధి పేరుతో జరిగే యాంత్రీకరణను (రోజుకు 350 మీ॥ పైగా తయారుచేసే జెట్‌లూమ్స్) అభివృద్ధి చేయటమా అన్నదే ఈ రోజు సమాజం ముందున్న ప్రశ్న? చేనేతలందరు, పవర్‌లూమ్స్‌కు మారటం తప్ప మరోమార్గం లేదని చెబుతున్నా ప్రభుత్వాలు, మేధావులు ఇప్పుడు జరుగుతున్న పవర్‌లూమ్స్ కార్మికుల ఆత్మహత్యలకు, దేశంలోని వివిధ ప్రాంతాలలో పవర్‌లూమ్ కార్మికులు ఉపాధికోల్పోతున్నందుకు ఏకారణాలు చెబుతారు? స్థిరకమయిన పరిష్కారాన్ని సూచిస్తారనేదే ప్రశ్న? ఈ ప్రశ్నకు చేనేత కార్మికుల కంటే జౌళిరంగంపై అధ్యయనం చేసి అనుభవం గడించిన కార్మిక సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, సామాజిక శాస్త్రవేత్తలు జవాబు చెప్పాల్సినటువంటి బాధ్యత ఉన్నది. ప్రపంచ సగటు పత్తి దిగుబడి 710 కేజీలు ఉండగా మనదేశ సగటు హెక్టారుకు 303 కేజీలు మనదేశ జౌళి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే మనదేశంలో పండించే ప్రత్తి దిగుబడిని పెంపొందించగలిగినప్పుడు పండిన ప్రత్తి మొత్తాన్ని దారంగా తయారు చేయగలిగినప్పుడు, మాత్రమే సాధ్యమని చేనేత కార్మిక సమాఖ్య భావిస్తుంది. సువాసనలు వెదజల్లె రంగు రంగుల పత్తిని జపాన్, జర్మనీ, అమెరికా, బ్రిటన్ మొదలగు అభివృద్ధి చెందిన దేశాలు పండిస్తున్నట్లుగా మనదేశంలో కూడా సెల్యూలర్, మాలిక్యులర్ బయోటెక్నాలజికి సంబంధించిన టెక్నాలజీని అభివృద్ధి చేయకుండా మనజౌళి పరిశ్రమ విదేశి జౌళిపరిశ్రమతో పోటీపడి అభివృద్ధి సాధించటమనేది భ్రమ మాత్రమే. 1985 నుండి విదేశాలలో ఈ విధమైన రంగు రంగుల ప్రత్తిని పండిస్తూ ప్రపంచ మార్కెట్లో పోటీకి అభివృద్ధి చెందిన దేశాలు నిలబడ్డాయి. మనదేశం మాత్రం ఈ పోటీకి ఎంత దూరంలో నిలబడిందో కూడా తెలియదు. (జౌళి ఎగుమతులలో మనదేశం వాటా 2.9% మాత్రమే,

ఈ క్రమంలోనే 1985 టెక్స్‌టైల్ పాలసీ తరువాత ఈ దేశంలో పవర్‌లూమ్స్ 31-3-86 నాటికి 6 లక్షల 38 వేల 764 మగ్గాలు ఉండగా 1992-93 నాటికి 12,39,268 మగ్గాలకు పెరిగింది. నేటికి 1999-2000 నాటికి 16,29,853 పవర్‌లూమ్ మగాలు దేశం మొత్తం మీద అభివృద్ధి చెంది 25 లక్షల మంది కార్మికులకు మాత్రమే పని కల్పిస్తున్నారు. ఆంధ్రరాష్ట్రంలో ఈ పవర్ మగాల సంఖ్య 43 వేలు. ఇవి ముఖ్యంగా నల్గొండ జిల్లా భువనగిరి, కరీంనగర్‌లో సిరిసిల్ల, వరంగల్, చిత్తూరు జిల్లాలోని నగిరి, నారాయణపురం, పుత్తూరులలో కేంద్రీకృతమై ఉంది. సిరిసిల్లలోని పవర్‌లూమ్ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారుగాని, పుత్తూరు, నారాయణవనం, భువనగిరి పవర్‌లూమ్ కార్మికులు ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడిన దాఖలాలు లేవు. భువనగిరి వద్ద నకిరికేల్ ఒక పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకోవటం జరిగింది. ఇక్కడ మనం ఈ ప్రాంతాల పవర్‌లూమ్‌ల మధ్య ఉన్న తేడాను గుర్తించాలి. అదేమిటంటే సిరిసిల్లలోని పవర్‌లూమ్స్ అన్ని కూడా 1987 నాటి భివాండి, షోలాపూర్, సూరత్, అహ్మదాబాద్‌లలో వినియోగించి తీసేసిన పవర్ మగ్గాలను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. ఇవి అప్పటికే విదేశాలలో వినియోగించి, వాళ్ళకు ఉపయోగపడని స్థితిలో స్విట్జర్లాండ్, ఇటలీ, నెదర్లాండ్, జర్మనీ మొదలగు దేశాలనుండి మనదేశంలోని షోలాపూర్, బివాండి, అహ్మదాబాద్ వారు సెకండ్‌హ్యాండ్ మిషనరీగా కొనుగోలు చేసి కొన్ని సంవత్సరాలు వినియోగించి అమ్మినందున ఈ పవర్ మగాలు నాణ్యతను కోల్పోయాయి. సిరిసిల్లలోని చేనేత

కార్మికులు ఈ విధంగా వినియోగించిన మరమగ్గాలను కొనుగోలు చేసి 1995-96 వరకు చేనేత కార్మికులకు రిజర్వేషన్ చేసిన ఉత్పత్తి రకాలను తయారు చేస్తూ వాళ్ళు జీవిస్తూ చేనేత కార్మికుల జీవనోపాధిని దెబ్బతీశారు. 1995-96 నుండి పవర్‌లూమ్స్ టెక్నాలజీలో వచ్చిన అనేక మార్పుల వలన ఉత్పత్తి రకాల పోటీని తట్టుకోలేక చేనేత రంగం కంటే దారుణంగా వెనుకబడి పోయారు. ఇదే భువనగిరి, నగిరి, పుత్తూరు, నారాయణపురంలో పవర్ మగ్గాలు ఆధునీకరించుకొని చేనేత ఉత్పత్తులను తయారు చేయడం వలన (జాకార్డ్స్, చైన్‌డాబి చేనేత ఉత్పత్తులను) ఈ ప్రాంత పవర్‌లూమ్ కార్మికులు జీవనాన్ని కొనసాగించుకొనుచున్నారు. ఇదే సిరిసిల్లలోని మరమగ్గాలు చైన్ డాబీలకు, జాకార్ట్ ఉత్పత్తులకు అనుకూలమైనవి కావు. అందువలన విలువైన వస్త్రాల, ఉత్పత్తులు తయారు చేయడం అనేది సిరిసిల్ల మరమగ్గాలపై తయారు చేయుట కష్టతరమయిన విషయం. మరొకకారణం ఏమిటంటే సిరిసిల్ల మరమగ్గాలపై పనిచేసేదంతా వేతన కూలీలు. వీళ్ళకు మరమగ్గాలు ఉండవు. సొంత మరమగ్గాలు కలిగిన వాళ్ళవద్ద ఒక కార్మికుడు నాలుగు మగ్గాలను చూస్తూ ఉత్పత్తి చేసే పని పద్ధతి సిరిసిల్లలో కొనసాగుతుంది. ఒక అంగుళంకు 42 పోగులు గల బట్టను నేస్తే కార్మికులకు ఒక మీటరుకు 40 పైసలు కూలీగా ఇస్తున్నారు. ఆవిధముగా రోజువారి కార్మికుడు నాలుగు మరమగ్గాలు 120 మీటర్లు బట్ట ఉత్పత్తి చేసినను వచ్చు కూలి 48 రూపాయలు. ఇదికూడా విద్యుత్‌కోత అమలులో ఉన్నందున ఒక షిఫ్టు 12 గంటలు పూర్తికాలం పనిచేయలేకపోవటం వలన 20-25 రూపాయలు మధ్యలోనే సంపాదించగలుగుతున్నారు. అంటే విద్యుత్‌కోతవలన సగానికి సగం ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. కార్మికుని జీవనపరిస్థితి ఇలా ఉంటే యజమానికి కూడా పెద్ద తేడాలేదు. లక్షరూపాయలకు పైగా బ్యాంకు ఋణాలతో పెట్టుబడి పెట్టి పని చేయించినా అతనికి వచ్చే కమీషన్ మీటరుకు 45 నుండి 50 పై మాత్రమే. కొనుగోలు దారుడు 1 మీటరుకు రూపాయి ఇచ్చినప్పటికి, నూలు వృదా. అవటం వలన కాని, వస్త్రం తయారీలో వచ్చే లోపాల వలన కాని 15 పై కోల్పోవాల్సి వస్తుంది. పెరిగిన విద్యుత్ రేట్ల వలన 5 హెచ్‌పి విద్యుత్ శ్లాబ్‌రేట్ అధికమయినందున యజమానికి వచ్చే 45పై. లోనే కరెంటు చార్జీలకు నెలకు 1200-1800 వరకు చెల్లించాల్సి వస్తుంది. ఈ విధంగా రెండు సాతాలు (ఒక సాతాలు రెండు మరమగ్గాలు) నేయించే యజమానికి ఎట్టి పరిస్థితులలోను గిట్టుబాటు కాని స్థితి. నాల్గు సాతాలు నేయించే యజమానికి మాత్రమే దానికి, దీనికి ముడిపెట్టి సర్దుకునే పరిస్థితి, ఈ ప్రత్యేక విషమ పరిస్థితులలో కుటుంబ జీవనానికి చాలని వేతనాలు పొందుతున్న కార్మికులు, రెండు సాతాలు నేయించే యజమానులు తీసుకున్న బ్యాంకు ఋణాలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇక్కడ అతి తక్కువ పెట్టుబడితో రిస్క్ లేకుండా తయారయిన వస్త్రాన్ని తిరిగి కొనుగోలు చేసేటటువంటి వ్యాపారస్తులు మాత్రమే లాభాలను గడించారు. ఇదే భువనగిరిలో 1-50 పైసలు చొప్పున, నగిరి, పుత్తూరు, నారాయణవనంలో 2 రూ నుండి 2-20 పైసలు చొప్పున మరమగ్గాల కార్మికులు మీటరుకు కూలి పొందుతూ చేనేత కార్మికుల హక్కులను హరింపచేస్తూ జీవిస్తున్నారే తప్ప పెరుగుతున్నా శాస్త్రసాంకేతిక అభివృద్ధిని చేజిక్కించుకొని జీవించటం లేదు. అందుకే "బలవంతుడిదే రాజ్యం" అనక తప్పటం లేదు.

అయినప్పటికి శతాబ్దాల నుండి ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని మనుగడ సాగిస్తున్న చేనేత రంగంలోని కోట్లాది మంది ప్రజలు ప్రతి సంవత్సరం వందల సంఖ్యలలో ఆకలి అనారోగ్య, ఆత్మహత్యలకు గురి అవుతున్నా, వస్తున్న విదేశీ టెక్నాలజీకి దీటుగా వస్త్రోత్పత్తితో ముందున్నది. 1985 నాటికి 3639 మిలియన్ల చదరపు మీటర్లు ఉత్పత్తి చేయగా 94-95 నాటికి 5750 మిలియన్ల చదరపు మీటర్లు ఉత్పత్తి చేయడం జరిగింది. ఇదే విధంగా 1999-2000 నాటికి చేనేత మగ్గాలపై 7382 మీ చదరపు మీటర్ల ఉత్పత్తి చేసి తన స్థానాన్ని నిలబెట్టుకుంది. ప్రపంచీకరణలో భాగంగా విదేశాలనుండి జెట్‌లూమ్స్‌ను, ఆటో లూమ్స్‌ను దిగుమతి చేసుకుంటూ బడా పారిశ్రామిక వేత్తలకు, బహుళజాతి సంస్థలకు తన స్వదేశీ మార్కెట్‌ను దారాదత్తం చేయటంలో భాగంగా అమలు జరుగుతున్న జాతీయ జౌళి విధానాన్ని అమలు చేయడంలో వచ్చిన పవర్‌లూమ్ సెక్టార్ సంక్షోభాన్ని అధిగమించే అవకాశం లేదు. అందువలనే 1995 నుండి దేశంలో అమలు జరుగుతున్న ఆర్థిక సంస్కరణలు, ప్రపంచ బ్యాంక్ నిబంధనలు, ఎగ్జిమ్ పాలసీ వలన బివాండి, షోలాపూర్, సూరత్, అహ్మదాబాద్ మొదలగు ప్రాంతాలలోని సొంత మరమగ్గాల యాజమానులు ఇప్పటికీ అధిక పెట్టుబడులు పెట్టలేక మూసివేయటం జరిగింది. విదేశీ యంత్రాల పోటీని మనదేశ పవర్‌లూమ్ మగ్గాలు తట్టుకోలేవు కాబట్టి జెట్‌లూమ్స్‌ను, ఆటోలూమ్స్‌ను దిగుమతి చేసుకోవాలి అనేది మనదేశంలోని ఉపాధి రంగాన్ని దెబ్బతీసి నిరుద్యోగాన్ని పెంచడం మాత్రమే. ఒక మరమగ్గం 12 మంది కార్మికుల ఉపాధి తొలగిస్తే, ఒక జెట్‌లూమ్ 48 నుండి 60 మంది పవర్‌లూమ్ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తుంది. కాబట్టి జెట్‌లూమ్స్, ఆటోలూమ్స్ దిగుమతిని, పవర్‌లూమ్ కార్మికులు, చేనేత కార్మికులు తప్పక వ్యతిరేకించాలి. చేనేత పరిశ్రమను రక్షించుకోవటం ద్వారా మాత్రమే ఇప్పటివరకు పవర్‌లూమ్స్‌పై ఉపాధి పొందిన కార్మికవర్గానికి జీవన భద్రతతోకూడిన ఉపాధి కలుగుతుందని, అంతే తప్ప చేనేత కార్మికుల రిజర్వేషన్ ఉత్పత్తులను తయారు చేసి, చేనేత వర్గానికున్న హక్కులను హరింప చేయకుండా ఉమ్మడి శత్రువైన సామ్రాజ్య వాద ప్రపంచీకరణకు లోబడి అమలవుతున్న జాతీయ జౌళివిధానానికి వ్యతిరేకంగా పోరాడనిదే పరిష్కారం లేదని గ్రహించి ఉద్యమించాలని రాష్ట్ర చేనేత కార్మిక సమాఖ్య కోరుతున్నది.

- మాచర్ల మోహనరావు

# చేనేత సంక్షోభానికి పరిష్కారం ఏమిటి?

'ఆంధ్రప్రదేశ్‌లో ఆత్మహత్యలు మామూలు వ్యవహారమే'

ఇదీ మరమగ్గాల, నేత కార్మికుల ఆకలిచావులపై అధికార వర్గాలు చాలా యధాలాపంగా చేసే వ్యాఖ్య. కరీంనగర్ జిల్లాలోని ఒక్క సిరిసిల్లలోనే 40 మంది మరమగ్గాల కార్మికులు, తెలంగాణా, కోస్తా ప్రాంతాలలో 25 మంది నేతపనివారు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఆత్మహత్యల పర్వంలో ఇవి కొన్ని తాజా గణాంకాలు మాత్రమే. గత పదేళ్లలో వివిధ వర్గాల ప్రజలు అత్యధిక సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడ్డ రికార్డు మన రాష్ట్రానిదే! ఒక్కసారి గతంలోకి వెళితే 1980 ప్రాంతంలో, 1990 మొదట్లో ఎంతమంది నేత కార్మికులు బలవంతపు చావులు కొనితెచ్చుకున్నారో... ఆ విషాద సంఘటనలన్నీ గుర్తుకొస్తాయి. 1998లో 300 మంది పత్తిరైతులు ఒక్క తెలంగాణా ప్రాంతంలోనే ప్రాణాలు తీసుకున్నారు. ఈ విషాద వాస్తవం ఇలా వుంటే - అధికారగణం చెప్పే మాటలు మరీ దారుణంగా వుంటున్నాయి. మొదటిది - ఆత్మహత్యల సంఘటలన్నీ వారి దృష్టికి కేవలం స్థానిక సమస్యలుగా మాత్రమే కనిపిస్తున్నాయి. రెండవది - ఆత్మహత్యలకు పాల్పడుతున్న వర్గాలకు, వృత్తిపరమైన నైపుణ్యం లేదని, వారి ఉత్పత్తులలో నాణ్యత కొరవడిందని చెబుతున్నారు. మూడవది - మార్కెటులో నిలదొక్కుకోవాలంటే, అంతర్జాతీయ పోటీని తట్టుకునేవిధంగా తయారుకావాలని దీనికోసం టెక్నాలజీని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవటం - తగిన శిక్షణ పొందటం అవసరమని చెబుతున్నారు.

సమస్య తాలూకు అసలు సందర్భాన్నీ, దాని తీవ్రతనీ, మూలకారణాలనీ, ఏ మాత్రం లెక్కలోకి తీసుకోకుండా యధాలాపంగా చేసే వ్యాఖ్యలే అవుతాయి ఇవి. పైగా ఈ రకమైన అవగాహనారాహిత్యం, పొంతన లేని పరిష్కారాలతో సమస్య మరింత ముదిరే ప్రమాదముంది. తాజా విషాదసంఘటనల్ని 1990 మొదట్లో జరిగిన ఆత్మహత్యలతో పోల్చిచూడటం అంటే ప్రస్తుత సమస్య తాలూకు, తీవ్రతను పూర్తిగా మరుగున పరిచినట్టే అవుతుంది. అందువల్ల సమస్యలకు మూలకారణాలను వాస్తవదృష్టితో మదింపు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. అప్పుడే తగిన పరిష్కారాలు చూపడానికి, సరైన విధాన రూపకల్పనకీ అవకాశముంటుంది.

## ఉపాధి కోసం వలసలు

చేనేత పరిశ్రమ మనదేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువమంది ఆధారపడ్డ రెండవ అతిపెద్ద రంగం. తరచూ ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా తట్టుకొని ఇంకా మనగలుగుతోంది. గ్రామీణ ప్రధానవృత్తులలో ఒకటైన చేనేత - 1960ల నుంచే క్షీణతకు గురికావడం మొదలైంది. దీనికి రెండు ముఖ్యకారణాలు కనిపిస్తాయి. మొదటిది, హరిత విప్లవంతో వ్యవసాయపద్ధతులలో అనూహ్యమైన సాంకేతిక మార్పులు చోటుచేసుకోవటం...దీనివల్ల వ్యవసాయంతో వ్యాపారధోరణులు వేగంగా చొచ్చుకురావటం మొదలైంది. ఈ మార్పుతో అప్పటిదాకా పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడ్డ రైతాంగం, చేతి వృత్తి పనివారల మధ్య సామాజిక సంబంధాలు దెబ్బతిన్నాయి.

రెండవది - 1960 ప్రాంతంలో పశ్చిమభారతంలో మరమగ్గాలు వేగంగా విస్తరించటం చేనేత పరిశ్రమ క్షీణదశకు తొలిమెట్టు అయ్యింది. పవర్‌లూమ్స్ విస్తరణతో గ్రామీణ మార్కెట్టులోకి చవకైన సింథటిక్ వస్త్రాలు ప్రవేశించాయి. పవర్‌లూమ్స్ పోటీకి, ధాటికి తట్టుకోలేక తరతరాలుగా, చేనేతనే నమ్ముకున్న చాలామంది ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కుంటూ ఇతర రంగాల్లోకి వెళ్లిపోయారు. మరి కొంతమంది హ్యాండ్‌లూమ్ సెంటర్లకు వలస వెళ్లారు. మాస్టర్ వీవర్ సిస్టమ్‌తో ఈ సెంటర్లు పవర్‌లూమ్స్ కి కాస్త గట్టిపోటీనే ఇచ్చాయి. ఫలితంగా ఇలా వలసవెళ్ళిన నేతకార్మికులతో నిండిన హ్యాండ్లూమ్ సెంటర్లు పట్టణ ప్రాంతాలలో తామరతంపరగా పెరిగాయి. ముఖ్యంగా ఈ మార్పు కోస్తాంధ్ర జిల్లాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

ఉన్న ఊరు వదిలి - వలస పోవటం అనేది తెలంగాణా ప్రాంతంలోనే బాగా వుంది. తరచూ దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడం - ఫలితంగా వ్యవసాయం, చేతివృత్తుల రంగాల మధ్య సామాజిక సంబంధాలు దెబ్బతినడంతో షోలాపూర్, భివాండీ, సూరత్ వంటి పశ్చిమ భారత టెక్స్‌టైల్ సెంటర్లకు, తెలంగాణా నుంచి వలసలు ఉధృతమయ్యాయి. తక్కువ వేతనాలు, దుర్భరమైన పని పరిస్థితులు మధ్య నేత కార్మికులు ఎన్ని అవస్థలు పడ్డా, పవర్‌లూమ్స్ రంగం మాత్రం ఆర్థికంగా పుంజుకుంది. పవర్‌లూమ్స్ నుంచి తమ ఉత్పత్తులకు తీవ్రమైన పోటీ ఎదురవడంతో, కరువు కాటకాలతో అసలే అంతంత మాత్రంగా వున్న చేనేత కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వలసలు అనివార్యమయ్యాయి.

తెలంగాణా ప్రాంతంలో వచ్చిన మరో ప్రధానమైన మార్పు ఏమిటంటే చేనేత మగ్గాలతో గట్టి పోటీ ఇచ్చిన మాస్టరు వీవర్లు

సైతం మరమగ్గాలవైపు మళ్లటం. పశ్చిమ భారతంలోని టెక్స్‌టైల్ సెంటర్లతో సంబంధాలుండటంతో వారికి ఈ పని ఎంతో సులువైంది.

ఉత్తర తెలంగాణాలోని సిరిసిల్ల ప్రధాన పవర్‌లూమ్ సెంటర్‌గా ఎదగటమే దీనికి నిదర్శనం. ఒక మామూలు గ్రామ పంచాయితీగా ఉన్న సిరిసిల్ల గత మూడు దశాబ్దాల కాలంలో దాదాపు పదివేల మరమగ్గాలతో వేలాది నేతకార్మికులకు ఉపాధి కేంద్రంగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఒక కుటుంబం మొత్తానికి జీవనాధారంగా వున్న చేనేత మగ్గాలకి పనిలేకపోవటంతో నేతపనివారు భుక్తికోసం ఇతర వృత్తుల వైపు చెల్లాచెదురయ్యారు. మగవారు పవర్‌లూమ్స్‌లో ఉపాధి వెతుక్కుంటూ వెళ్లగా, కుటుంబంలోని మహిళలకి పిల్లలకి కూడా నేత రంగంలో పనిలేకపోవటంతో, బీడీతయారీవైపు మళ్లారు. ఎన్నో ప్రధాన బీడీకంపెనీలు, ఉత్తర తెలంగాణాను కేంద్రంగా చేసుకోవటం - నిర్వాసితులైన నేతపనివారికి నిజంగా వరమైంది.

## చట్టాలున్నా తప్పని చేటు

తాజా సంక్షోభాన్ని అర్థం చేసుకోవాలంటే 1980 మధ్య కాలంలో టెక్స్‌టైల్ రంగంలో వచ్చిన విధానపరమైన మార్పు గురించి తెలుసుకోవాలి. గ్రామీణ పట్టణప్రాంత నిరుపేదలకు కట్టుకోవటానికి బట్ట, ఉపాధి కల్పన అనేవి 1985 వరకు ప్రభుత్వ విధాన లక్ష్యాలుగా ఉండేవి. కానీ ఆ తర్వాత ఈ లక్ష్యాలు మారాయి. టెక్స్‌టైల్ పరిశ్రమలో ముఖ్యభాగాలైన చేనేత, పవర్‌లూమ్స్, మిల్లుల మధ్య ఉత్పాదకత, సామర్థ్యం, పోటీతత్వాన్ని పెంచడంపై దృష్టి సారించింది ప్రభుత్వం. ఈ విధానపరమైన మార్పు టెక్స్‌టైల్ రంగంలో భారీ మార్పులకు ద్వారాలు తెరిచాయి. పవర్‌లూమ్స్ రంగంపై ఆంక్షలు సడలిపోతాయి. ఫలితంగా, పవర్‌లూమ్స్ ఆ తర్వాతికాలంలో అనూహ్యంగా విస్తరించాయి. అయితే ఈ ధాటికి చేనేతరంగం కుంగిపోకుండా చూసేందుకు ప్రభుత్వం కొన్నిరక్షణలు కల్పించింది. 22 రకాల వస్త్రాల తయారీని ప్రత్యేకంగా చేనేత రంగానికి రిజర్వు చేస్తూ చట్టం తెచ్చింది. అంతేగాక మిల్లులు వాటి ఉత్పత్తిలో 50 శాతం హాంక్ యార్న్‌ని చేనేత రంగానికి విధిగా సరఫరా చేయాలన్న నిబంధన విధించింది. కానీ ఇలాంటి రక్షణలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఆచరణలో అంతా శూన్యమే. ఉదాహరణకి 22 రకాల ఉత్పత్తుల రిజర్వేషన్ యాక్టునే తీసుకుంటే - పవర్‌లూమ్, మిల్లు లాబీలు దీన్ని కోర్టులో సవాల్ చేయడంతో ఇది అమలుకు నోచుకోకుండా దాదాపు ఎనిమిదేళ్లపాటు న్యాయస్థానం గడపలోనే ఉండిపోయింది. 1993లో సుప్రీంకోర్టు ఈ చట్టాన్ని అన్ని విధాలా రాజ్యాంగపరమైనదిగా పేర్కొన్నప్పటికీ కేంద్రప్రభుత్వం దీన్ని అమలు చేయలేదు. పైగా ఓ రివ్యూ కమిటీ వేసింది. చేనేతని ఆదుకునే చర్యలు సిఫార్సు చేయాల్సింది పోయి ఈ కమిటీ 22 ఉత్పత్తులను 11కు కుదించింది. ఇలా ఈ తతంగమంతా ఏళ్లపాటు జరుగుతుంటే మరోవైపు పవర్‌లూమ్స్, మిల్లులు ఈ మధ్యకాలంలో చేనేత రంగానికి చేయాల్సినంత నష్టం చేసేశాయి. చేనేతరంగానికి మాత్రమే రిజర్వు చేసిన వెరైటీలను ఉత్పత్తి చేయడమేగాక చేనేతకు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చిన డిజైన్లకు డూప్లికేటు డిజైన్లు కూడా సృష్టించి కుప్పలుతెప్పలుగా మార్కెట్లకు వదిలాయి. ఇది చేనేతరంగానికి చేసిన కీడు అంతా ఇంతా కాదు.

1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు కూడా చేనేతరంగాన్ని చావుదెబ్బ తీశాయి. 1990 మొదట్లో కాటన్, యార్న్ ఎగుమతులకు నూతన వాణిజ్య సరళీకరణ పుణ్యమా అని పెద్ద ఊపు వచ్చింది. దీంతో దేశీయంగా చేనేతకు ముఖ్యమైన ముడిసరుకైన హాంక్‌యార్న్ ధరలు అమాంతం పెరిగాయి. దీనికి అనుగుణంగా నేతకారులు చమటోడ్చి నేసిన వస్త్రాల ధరలు మాత్రం పెరగలేదు. ఫలితంగా మాస్టర్ వీవర్లు రిస్కు తీసుకోవటానికి జంకటంతో అనేక ప్రధాన హ్యాండ్‌లూమ్ సెంటర్లలో ఉత్పత్తి దాదాపు స్తంభించిపోయింది. దీంతో వందలాదిమంది నేతపనివారు ఉపాధిలేక రోడ్డున పడ్డారు. అప్పులు పెరిగాయి. తిండి కరువైంది. జబ్బులపాలయ్యారు. ఆకలిబాధతోనూ, ఆత్మహత్యలతోనూ 150. మందికి పైగా చేనేత కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

## చుక్కల్లో నూలు ధరలు

1985 నుంచి ప్రభుత్వ విధానంలో వచ్చిన మార్పు ఫలితంగా పవర్‌లూమ్ రంగం రూపురేఖలే మారిపోయాయి. టెక్నాలజీ దిగుమతులపై ఆంక్షలు తొలగిపోవడంతో, పవర్‌లూమ్స్‌ని ఆధునిక సాంకేతిక మార్పులతో మెరుగుపర్చుకునే వీలు చిక్కింది. సెమీ ఆటోమేటిక్, జెట్‌మగ్గాలు, వచ్చాయి. దీంతో అప్పటిదాకా వాడుకలో వున్న సాధారణ పవర్‌లూమ్స్ మూలన పడే ప్రమాదం ఏర్పడింది. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే ఉత్తర తెలంగాణా అంతటా ఇలాంటి పవర్‌లూమ్సే వున్నాయి. కొత్తగా వచ్చిన అత్యాధునిక మగ్గాల పోటీని ఎదుర్కోలేక ఒక్కసారిగా అవి చతికిలపడ్డాయి. ఈ పరిణామం పవర్‌లూమ్ సంక్షోభానికి దారితీసింది. మరోవైపు నూలు ధరలు చుక్కలనంటాయి. ఇది చేనేతతోపాటు పవర్‌లూమ్స్ రంగాన్ని కూడా చావుదెబ్బ తీసింది. దీనికి తోడు విద్యుత్ సంస్కరణల కారణంగా మనరాష్ట్రంలో కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగాయి. ఓవైపు యార్న్, డై రసాయనాల ధరలు, విద్యుత్‌ఛార్జీలు ఊహించనంతగా పెరగడం - దీనికి అనుగుణంగా కార్మికులు కష్టపడి తయారుచేసిన వస్త్రాల ధరలు మాత్రం అదేస్థాయిలో వుండటం, మరోవైపు పొరుగున వున్న తమిళనాడు నుంచి చవకైన నూలు ఉత్పత్తులు వెల్లువలా ముంచెత్తడంతో రాష్ట్రంలోని అత్యధిక

పవర్‌లూమ్ యజమానులు (వీరిలో 80 శాతం మంది 4-6 మరమగ్గాలున్న చిన్నస్థాయి వీవర్లే) ఉత్పత్తికి స్వస్తిచెప్పారు. అస్తవ్యస్తంగా వున్న విద్యుత్ సరఫరా కూడా పవర్‌లూమ్ సంక్షోభాన్ని మరింత ఎగదోసింది. ఇది ఏ స్థాయికి చేరిదంటే, కేవలం గత రెండు నెలల్లో దాదాపు వెయ్యి మరమగ్గాలను తుక్కుకింద అమ్ముకోవలసి వచ్చింది. ఇది నిజంగా గుండె చెదిరే విషాద వాస్తవం. దీన్నిబట్టి నేతకార్మికుల్లో నిరాశా నిస్పృహలు ఎంతగా పేరుకుపోయాయో అర్థమవుతుంది.

## ఆదుకోని కమిటీలు

టెక్స్‌టైల్ రంగంపై ఏర్పాటైన సత్యం కమిటీ సిఫారసుల ఆధారంగా ప్రభుత్వం 2000 టెక్స్‌టైల్ పాలసీని రూపొందించింది. ఈ పరిశ్రమ ప్రయోజనాల కోసం కొన్ని మార్పులను ప్రకటించింది. నేత కార్మికులను, వారు ఉత్పత్తి చేసే వస్త్రాలు, వాటి నాణ్యత ఆధారంగా మూడు అంచెలుగా వర్గీకరించాలని సత్యం కమిటీ సిఫారసు చేసింది. విశిష్టమైన, అత్యుత్తమమైన నాణ్యతగల నూలు ఉత్పత్తులను తయారుచేసే వీవర్లని మొదటి అంచెలో, కాస్త మధ్యరకం తక్కువ ధరగల వస్త్రాలను తయారుచేసే వారిని రెండవ అంచెలో చేర్చింది. నిర్దిష్టమైన ఉపాధి అంటూ లేని, ఉత్పత్తులలో ప్రమాణాలు కనిపించని, మిగతా అందరినీ మూడో అంచెలో చేర్చారు. హ్యాండ్లూమ్, పవర్‌లూమ్ రంగాల్లోని రెండు మూడు అంచెల్లోని నేత కార్మికులకు తగినశిక్షణ ఇచ్చి క్రమంగా మొదటి అంచెస్థాయికి చేర్చాలనేది సత్యం కమిటీ ప్రధాన సిఫారసు. సిఫారసు వరకైతే బాగానే వుంది కానీ, ఆచరణలో ఎంతమంది సాధారణ నేత కార్మికులను సెమీ ఆటోమేటిక్, జెట్ పవర్‌లూమ్స్ సెక్టార్‌లో ఉపాధి కల్పించగలమన్నదీ ప్రధాన ప్రశ్న. టెక్స్‌టైల్ రంగానికి సంబంధించి 1974లో శివరామన్ కమిటీ ఇచ్చిన నివేదికలోని అంశాలు ఇక్కడ గమనార్హం. ఒక్క పవర్‌లూమ్ కనుక ఏర్పాటు చేస్తే 12 మంది చేనేత కార్మికులకు పనిలేకుండా పోతుందని అంచనా. అందువల్ల పవర్‌లూమ్స్ విస్తరణ చేనేతరంగానికి గొడ్డలిపెట్టు అని ఈ నివేదిక అప్పుడే స్పష్టంగా పేర్కొంది. ఓ మామూలు పవర్‌లూమ్ కారణంగానే డజనుమందికి పనిలేకుండాపోతే, ఇప్పటి అత్యాధునిక పవర్‌లూమ్స్ వల్ల ఇలాంటి వారి సంఖ్య ఎన్నిరెట్లు వుంటుందో ఊహకందని సంగతి. ఒక అంచనా ప్రకారం 40 సాధారణ పవర్‌లూమ్స్ చేసే ఉత్పత్తిని కేవలం ఒక ఆధునిక జెట్ పవర్‌లూమ్ చేస్తుంది. పై ఉత్పత్తి నాణ్యత విషయంలో మామూలు పవర్‌లూమ్స్ వాటికంటే ఉత్తమంగా ఉండటమే కాక, ధరలో సైతం వాటికంటే చవగ్గా వుంటాయి. పవర్‌లూమ్స్ పరిస్థితే ఈ రకంగా వుంటే సాధారణ చేనేత కార్మికుడి దైన్యం గురించి చెప్పేదేముంది. 22 రకాల ఉత్పత్తుల్ని చేనేతరంగానికి మాత్రమే రిజర్వు చేసిన చట్టంతో పాటు, మిల్లులు విధిగా వాటి ఉత్పత్తిలో 50 శాతం యార్న్‌ని చేనేత రంగానికి సరఫరా చేయాలన్న నిబంధనతో గతంలో చేనేత రంగానికి ఏ కాస్తో రక్షణ వుండేది. ఈ రక్షణలను దశలవారీగా ఎత్తివేయాలని సత్యం కమిటీ చేసిన సిఫారసులు అమలైతే గనక చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం.

## సలహాలు కాదు... కార్యాచరణ కావాలి

2004లో సత్యం కమిటీ సిఫారసులు అమల్లోకి రానున్నాయి. అప్పుడు కచ్చితంగా చేనేత, పవర్‌లూమ్ రంగాలకు చేటు తప్పదు. పవర్‌లూమ్, హ్యాండ్లూమ్ సంక్షోభం తీవ్రతను సత్యం కమిటీగానీ, టెక్స్‌టైల్‌పాలసీ 2000 విధాన నిర్ణేతలుగానీ, పట్టించుకున్న దాఖలా లేదు. ఒకప్పుడు సమాజంలో గౌరవప్రదమైన స్థాయిలో వున్న చేనేత కార్మికవర్గం - ప్రస్తుతం నూలు ధరలు చుక్కలనంటడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. తరతరాలుగా నేత వృత్తినే నమ్ముకున్న వేలాదిమంది ఇప్పుడు హఠాత్తుగా ఏ ఇతర వృత్తుల్లోనూ ఒదిగిపోలేరు. వారి జీవనోపాధికి తగిన రక్షణ కల్పించాల్సింది ప్రభుత్వమే. లేకుంటే దుర్భర దారిద్ర్యంతో ఇల్లు గడవక, నిలవనీడలేక, ఆకలికి తట్టుకోలేక ఆత్మహత్యల దారి పట్టే ప్రమాదముంది. మన విధాన నిర్ణేతలు, బ్యూరోక్రాట్‌లు, టెక్నోక్రాట్‌లు, జర్నలిస్టులు... ఇలా అంతా ఇప్పుడు గ్లోబలైజేషన్ మంత్రాన్ని జపిస్తున్నారు. అంతర్జాతీయంగా పోటీపడే సత్తా పెంచుకోవాలని ఉచిత సలహాలిస్తున్నారు. కానీ అతి సంక్లిష్టమైన గ్లోబల్ మార్కెట్‌లో సామాన్య నేత కార్మికుడు ఏవిధంగా పోటీపడాలో, అందుకు తగిన సౌకర్యాలు, అవకాశాలు వారికి ఏం కల్పిస్తున్నారో మాత్రం ఎవరికీ తెలియదు. ఇలాంటి అర్థంలేని, ఆచరణ సాధ్యం కాని ఉచిత సలహాలు చివరికి నేత కార్మికులకి ఆత్మహత్యా సదృశమే అవుతాయి. అంతా ఆధునికీకరిస్తామని, ఏదేదో చేసేస్తామన్న ఉత్త మాటలకు స్వస్తి చెప్పి నేత కార్మికుల జీవనోపాధిని రక్షించే ఏర్పాటు చేయాలి. వారికి అత్యవసరమైన నూలు, డై రసాయనాలు వంటి ముడిసరుకుని చవకగా నిరంతరం అందుబాటులో ఉండేట్లు చూడాలి. ప్రైవేటు ఋణవలయంలో చిక్కుకోకుండా నేత కార్మికులని రక్షించేందుకు వారికి ప్రభుత్వ పరంగా రుణసదుపాయం అందేట్లు చూడాలి. ఉత్పత్తుల్ని అమ్ముకోడానికి అవసరమైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే చేనేత కార్మికులు కాస్తయినా వెలుగుని చూడగలుగుతారు. ఆత్మహత్యల పర్వానికి తెరపడుతుంది.

- ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు

# చేనేత, మరమగ్గాల సంక్షోభం - పరిశీలన

గత కొద్ది నెలలుగా సిరిసిల్లాలోని నేత కార్మికుల ఆత్మహత్యలు చేసుకోవడం జాతీయ పత్రికల పతాక శీర్షికలకు ఎక్కడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల పర్యటనలతో, ప్రకటనలతో నేత కార్మికుల సమస్యలు చర్చలోకి వచ్చాయి.

సమస్యకు ప్రతిస్పందించిన ప్రభుత్వం కానీ ప్రతి పక్షాలు కానీ సమస్యలోతుల్లోకి వెళ్ళకుండా తాత్కాలిక పరిష్కార మార్గాలు ప్రతిపాదిస్తున్నారు. మరమగ్గం నేసే కార్మికులు (సిరిసిల్లా) చేనేత కార్మికులు (దుబ్బాక) ఆత్మహత్యలు చేసుకుంటే, రెండు రంగాల సమస్యలకు భిన్నమైన కారణాలున్నప్పటికి సమస్యను చేనేత కార్మికుల సమస్యగా చూడడం, ఆప్కో బకాయిల చెల్లింపు, చనిపోయినవారికి 10 వేల ఎక్స్‌గ్రేషియా. ఆత్మహత్యల నివారణకు డాక్టర్లతో కౌన్సిలింగ్ వంటి చర్యలు తాత్కాలిక దృష్టిని తెలియచేస్తున్నాయి. త్వరలో పంచాయితీ ఎన్నికలుండడం కారణంగా వివిధ రాజకీయ పక్షాలు తమ తమ ప్రయోజనాల దృష్ట్యా సమస్యను విశ్లేషిస్తున్నారు.

1985 టెక్స్‌టైల్ పాలసీ పరిశ్రమలలో ఆధునీకరణను ప్రవేశపెట్టేందుకు అంగీకరించడంలో బాగంగా సిరిసిల్లాలాంటి చోట్ల పెద్ద ఎత్తున మరమగ్గాలకు లైసెన్సులివ్వడం, అనధికార మరమగ్గాలను చట్టబద్ధం చేయడం ఫలితంగా ఉత్తర తెలంగాణాలో చేనేత మగ్గాలు పెద్ద ఎత్తున మూతపడ్డాయి. సిరిసిల్లాలో 1970 నుండి ప్రారంభమైన మరమగ్గాల విస్తరణ 1990 ల నాటికి 12 వేల మరమగ్గాలకు పెరిగింది. చేనేత కార్మికులు నేసే 22 రకాల వస్త్రాలను పవర్‌లూం రంగంలో ఉత్పత్తి జరగకుండా నియంత్రించడంలో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసాయి. అనేకమంది చేనేత కార్మికులు సూరత్, భివాండీ, షోలాపూర్ వలసపోగా చేనేత కుటుంబాలలోని స్త్రీలు బీడీ పరిశ్రమకు మార్పు తీసుకున్నారు. 1970కు ముందు తెలంగాణా ప్రాంతంలో చేనేత పరిశ్రమలో పని చేసేవారు స్థానిక మార్కెట్ అవసరాల కనుగుణంగా ఉత్పత్తి చేసి తమ ఉత్పత్తులను సంతలలో విక్రయించుకొని జీవనం గడిపేవారు. 1970 తరువాత వచ్చిన మరమగ్గాలు, మిల్లులలో ఉత్పత్తి చేసిన గుడ్డ తక్కువధరకు మార్కెట్‌కు రావడంతో వీటి పోటీకి తట్టుకోలేక ఉపాధికోల్పోయారు.

స్వాతంత్ర్యానంతరం కుటీర పరిశ్రమ అయిన చేనేతరంగం చట్టపరంగా, విధానాల పరంగా 1985 వరకు అనేక రక్షణలున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోకపోవడంతో నష్టపోయారు. 1990ల తర్వాత వచ్చియన హెచ్.డి.పి, వి.హెచ్.డి.పి, క్వాలిటి డైయింగ్ కేంద్రాలు వంటి పథకాలు కాంగ్రేస్, తెలుగుదేశం ప్రభుత్వాలు తమ అనుయాయుల ద్వారా బోగస్ సొసైటీలు ఏర్పరచి ఈ నిధులను పెద్ద ఎత్తున కొల్ల గొట్టారు. చేనేత రంగంలో క్రియాశీల నాయకత్వ వైఫల్యం ఫలితంగా సంభవించిన పరిణామమిది.

1985 తరువాత మరమగ్గాల ప్రవేశంతో బోగస్ సొసైటీలు మరమగ్గాలపై నేసిన బట్టను చేనేతగా ఆప్కో ద్వారా కొనుగోలు చేయడం ద్వారా చేనేత రంగంలో సహకార రంగం బలహీన పడింది. 1984 తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశ ప్రభుత్వం నష్టాలు వచ్చిన సొసైటీలను లాభాలలో వున్న సొసైటీలలో విలీనం చేయడం ద్వారా ఆరోగ్యంగా వున్న సొసైటీలు కూడా జబ్బున పడ్డాయి. రాష్ట్రం మొత్తం మీద కో-ఆపరేటివ్ సెక్టార్లను నిర్వీర్యంచేసి మాస్టర్ వీవర్స్ కింద కూలీలుగా చేనేత కార్మికులు మారిన పరిణామ క్రమాన్ని ఆప్కో వేగవంతం చేసింది. గత రెండు సం॥లుగా ఆప్కో కొనుగోలు చేసనబట్టకు బకాఘలు చెల్లించకుండా వడ్డీలపై వడ్డీలు పెరుకొని 60 మందికి పైగా ఆత్మహత్యలు జరిగితే కానీ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధ పడలేదు.

రాష్ట్రంలో మరమగ్గాల విస్తరణ చేనేతరంగ క్షీణతకు దారి తీయడమే గాక మరమగ్గాల అభివృద్ధికి తీసుకునే ప్రతీ చర్య చేనేతకు గొడ్డలి పెట్టువంటిదనడం అతిశయోక్తి గాదు. ఎందువలనంటే చేనేతకు రిజర్వ్ చేసిన రకాలు మరమగ్గాలపై ఉత్పత్తి చెయ్యడం, చేనేతబట్టను కొనుగోలు చేయాల్సిన ఆప్కో మరమగ్గంపై నేసిన బట్టను కొనుగోలు చేయడం వంటి చర్యలు చేనేత కార్మికుల ప్రయోజనాలకు నష్టకరం.

ఈ నేపథ్యంలో సిరిసిల్లా పరిణామాన్ని , మరమగ్గాల సంక్షోభానికి గల కారణాలను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. 1985 తర్వాత జౌళి పరిశ్రమలో మరమగ్గాల ఆధునీకరణతో ఉపాధి కోల్పోయిన కార్మికులు సూరత్,భీవండీలనుండి త్యజించబడిన మరమగ్గాలను కొనుగోలు చేసి సిరిసిల్లాలాంటి చోట్ల మరమగ్గాలు ఏర్పరచారు. గత రెండు దశాబ్దాలుగా మర మగ్గాల యజమానులుగా మారిన వారిలో 80 శాతం వారు 4 నుండి 8 మగ్గాల వారుగా వున్నారు. 20 శాతం మాత్రమే 30-40 మగ్గాల యజమానులుగా వున్నారు. (మాస్టర్ వీవర్స్), వీరు కేస్‌మెంట్

బట్టనుత్పత్తి చేసి, మహారాష్ట్ర, కర్నాటక, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసి లాభపడ్డారు. అయితే ఈ రంగంలో ప్రభుత్వ సహకారం కొరవడడంతో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు మరమగ్గాల యజమానులు ముందుకు రాలేదు. విద్యుత్‌రంగంలో సంస్కరణల ఫలితంగా కరంటు చార్జీల పెరుగుదల, ముడిసరుకు అయిన నూలు, రంగులపై ఎక్సైజ్ సుంకం, సేల్స్‌టాక్స్ పెరుగుదల, జట్‌లూంలపై ఉత్పత్తి చేసిన నాణ్యమైన బట్ట తక్కువ రేటుకు మార్కెట్లోకి రావడంతో పోటీకి తట్టుకోలేక అమ్మకాలు తగ్గాయి. దీనికితోడు కరంటు కోతతో ఉత్పత్తి తగ్గి కార్మికులు పూర్తికాలం పని లభించక ఆదాయం తగ్గిపోయింది. సిరిసిల్లాలోని మాస్టర్‌వీవర్లు సెమీ ఆటోమేటిక్ మగ్గాలు ఏర్పరచాలన్నా జెట్‌లూంల పోటీకి తట్టుకోలేమని ముందుకు రావడం లేదు.

డబ్ల్యు.టి.ఒ. కు అనుకూలంగా కేంద్రప్రభుత్వం ఎగ్జిమ్‌పాలసీలో మార్పులు చేసి 1429 సరుకులపై ఉన్న ఆంక్షలు తొలగించడంతో (ఇందులో 326 టెక్స్‌టైల్ ఉత్పత్తులున్నాయి) విదేశాల నుండి వచ్చే పోటీని తట్టుకోలేమని, పెట్టిన పెట్టుబడిపై గ్యారంటీ లేక సిరిసిల్లా మర మగ్గాల యజమానులు వెనక్కు తగ్గుతున్నారు. గత 4 సం॥లుగా సిరిసిల్లాలో నేత కార్మికుల వేతనాలు పెరగకపోవడం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, సూరత్ బివాండీలలో మర మగ్గాల పరిశ్రమతో సంక్షోభంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

మరమగ్గాల పరిశ్రమను రక్షించేందుకు తగిన నిర్మాణాత్మక సహకారం రాష్ట్ర ప్రభుత్వం నుండి కొరవడడం, స్వయంగా తెలుగుదేశ ప్రభుత్వం స్పిన్నింగ్ మిల్లుల్ని మూసివేయడం, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించేందుకు చర్యలు చేపట్టడం కూడా మరమగ్గాల యజమానులు వెనక్కు తగ్గడానికి కారణాలుగా వున్నాయి.

మార్కెట్లో మాంద్యం కారణంగా కార్మికులు కనీస హక్కులకు ఉద్యమించ లేకపోయినా, కార్మికులు, పవర్‌లూం యజమానులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మరమగ్గాల పరిశ్రమ ప్రయోజనాల రక్షణకు ముందుకు రావాల్సి వుంది.

1985 జౌళీ విధానం ఆధునీకరణ విధానాలద్వారా చేనేత రంగాన్ని తీవ్రంగా నష్టపరిచినా చేనేతకు గల 22 రకాల రిజర్వేషన్‌ను, స్పిన్నింగ్ మిల్లులు 50 శాతం హాంక్‌యార్న్‌ను విధిగా ఉత్పత్తి చేయాలనే నిబంధనను బలపర్చింది.

1995లో మీరాసేథ్ కమిటీ, చేనేతపై 1985 జౌళివిధానం ప్రభావం, సంక్షేమ పథకాల అమలు తీరువంటి అంశాలను పరిశీలించ కుండానే 22 రకాల రిజర్వేషన్‌లను 11కు తగ్గించాలని, 2004 తర్వాత అంతర్జాతీయ పోటీలు తట్టుకొని నిలబడాలంటే చేనేత రంగం మరమగ్గాలకు మార్పు తీసుకోవాలని, సూచించింది. అంతేగాక కంప్యూటరైజ్డ్ డిజైన్లు రూపొందించాలని, చేనేత కార్మికులకు అంతర్జాతీయ ప్రమాణాలు పాటించే విధంగా శిక్షణా సౌకర్యాలు కల్పించాలని 1985 జౌళీవిధానం వెలుగులోనే మరింత ముందుకు వెళ్ళి చేనేత రంగానికి నష్టం కలిగించే సిఫార్సులు చేసింది.

1998లో ఏర్పడిన సత్యం కమిటీ 11 రకాల రిజర్వేషన్లనే గాకుండా స్పిన్నింగ్ మిల్లులు 50 శాతం హాంక్‌యార్న్ విధిగా ఉత్పత్తి చేయాలనే దీన్ని తొలగించివేసింది. చేనేత రంగంలో సెమీ ఆటోమాటిక్ మర మగ్గాలు ప్రవేశపెట్టి ఉత్పత్తిని పెంచాలని కోరింది. సెమీ ఆటోమేటిక్ మగ్గాల ప్రవేశం వలన ఉపాధికోల్పోయే లక్షలాది చేనేత కార్మికులను నొప్పిలేకుండా" వదిలించుకోవాలని చెప్పింది.

అయితే నేడు సిరిసిల్లాలోని మరమగ్గాల సంక్షోభం విధాన కర్తల కళ్ళు తెరిపించాలి. మార్కెట్‌పై ఎటువంటి నియంత్రణలు లేకుండా సెమీ ఆటోమేటిక్ మగ్గాలు సైతం పోటీకి తట్టుకొని నిలబడడం కష్టం. వీటికన్నా మెరుగైన సాంకేతిక పరిజ్ఞానంగల జెట్ లూంల పోటీలో సెమీ ఆటోమాటిక్ మగ్గాలు ఎలా నిలబడతాయో సత్యం కమిటీ వివరించలేదు.

సత్యం కమిటీ సిఫార్సుల ఫలితంగా వచ్చిన కేంద్ర ప్రభుత్వ జౌళి విధానం (2000) చేనేత రంగంతో పాటు మరమగ్గాల రంగాన్ని కూడా పూర్తిగా దెబ్బతినే వైపునెడుతోంది. పత్తినూలు ఎగుమతులద్వారా ముడిసరుకుల కొరతను సృష్టించి, నూలు రంగుల ధరలు పెంచడం, దిగుమతులపై ఆంక్షలు సడలించడంతో బహుళజాతి కంపెనీల ఉత్పత్తులు తక్కువ ధరలకు మార్కెట్‌కు రావడంతో దేశీయ ఉత్పత్తులు దెబ్బతిని, ఉపాధికోల్పోయే క్రమం మొదలైంది. సిరిసిల్లా, దుబ్బాక ఆత్మహత్యలు దీనికి సంకేతాలు మాత్రమే.

సాంకేతిక పరిజ్ఞానం ఆధునీకరణ, మార్కెట్ అన్ని సమస్యలకు పరిష్కారం కాదు. అభివృద్ధి చెందిన తక్కువ జనాభాగల దేశాలు ఆధునీకరణ ద్వారా ఒక రంగంలో ఉపాధి కోల్పోతే వేరొక రంగంలో ఉపాధి కల్పించారు తప్ప అక్కడ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడలేదు. దీనికి భిన్నంగా అత్యధిక జనాభాల మనదేశంలో ఆధునీకరణ ఉపాది కల్పనకు దారి తీయదు. వినాశకర పరిణామాలు సంభవిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలు, నేతన్నల ఆత్మహత్యలు, కార్మికుల ఆత్మహత్యలు దేశాన్ని లాటిన్ అమెరికన్ దేశాలలోని దుస్థితికి దారి తీస్తుంది.

అంతర్జాతీయ వాణిజ్య సంస్థకు అనుకూలంగా 2004 కన్నా ముందుగానే కేంద్ర ప్రభుత్వం దిగుమతులపై ఆంక్షలు సడలించడం, ప్రపంచ బ్యాంకు నిబంధనలకు లోబడి రాష్ట్ర

ప్రభుత్వం సబ్సిడీలు ఉపసంపహరించడంతో కుటీర పరిశ్రమ అయిన చేనేత, పవర్‌లూం రంగాల ఉనికికే పెద్ద ప్రమాదం ముంచుకొచ్చింది. దీనిని అర్థంచేసుకుని సరయిన రీతిలో రాజకీయంగా స్పందించాల్సిన తరుణం మన ముందుకొచ్చింది. అభివృద్ధి చెందిన దేశాలు కార్లు, స్కూటర్లు, టీవీలు, ఫ్రిజ్‌ల నుండి టెక్స్‌టైల్ ఉత్పత్తులు, ఆహారధాన్యాలు, నూనెలు గుండు సూదివరకు మన మార్కెట్‌ను కబళించి వేస్తున్నాయి. ఫలితంగా ఆయాదేశాల్లో సంక్షోభంలో వున్న పరిశ్రమలలోని కార్మికులు ఉపాధి పొందుతున్నారు. అభివృద్ధి చెందిన దేశాలలోని కార్మికులకు ఉపాధి కల్పించాలంటే పేద దేశాలలోని కార్మికులు మన మార్కెట్‌ను వారికి అప్పచెప్పి మన ఉపాధి అవకాశాలు కోల్పోవడంలోనే అసలు సమస్య ఇమిడి ఉంది.

దీనిని పరిష్కరించాలంటే బయటినుండి దిగుమతయ్యే వస్తువులపై పన్నులు వేసి స్థానిక ఉత్పత్తులను మార్కెట్ అందుబాటులో వుంచాలి.

చేనేతరంగంలో వివిధ వర్గాలున్నాయి. 30-40 మగ్గాలు గల పెద్ద మాస్టర్ వీవర్లు, 5-10 మగ్గాలు కలిగిన చిన్నతరహా మాస్టర్ వీవర్లు, మాస్టర్ వీవర్స్ కింద పని చేసే కార్మికులు, వలసవచ్చిన షెడ్ వర్కర్స్ వున్నారు. వీరందరికి విడివిడిగా సమస్యలున్నాయి. అదే విధంగా మరమగ్గాల వారిలో పెద్ద మాస్టర్ వీవర్లు, చిన్నతరహా మాస్టర్ వీవర్లు, నేత కార్మికులున్నారు. అందరికి ఉమ్మడి సమస్యలయిన ముడిసరుకుల, రంగుల ధరల పెరుగుదల, స్థానిక మార్కెట్ అందుబాటులో వుండడం అనేవి వున్నాయి.

చేనేత, మర మగ్గాల రంగంలోని వివిధ వర్గాలుగా వున్న వారి సమస్యలను గుర్తించి నిర్దిష్టమైన డిమాండ్లతో ఉమ్మడి సమస్యల సాధనకు ఉపాధి రక్షణకు సమైక్య పోరాటం చెయ్యాల్సిన అవసరం వుంది. అదే సమయంలో అత్యంత దుర్భర పరిస్థితులలో ఉన్న షెడ్ వర్కర్స్, కార్మికులను వెట్టి దోపిడికి, అధిక వడ్డీలకు గురికాకుండా రక్షించాల్సిన అవసరముంది. వివిధ వర్గాల మధ్యగల వైరుధ్యాలు, సమిష్టి సమస్యలు కలగా పులగం చెయ్య కూడదు. షెడ్ వర్కర్స్, కార్మికుల హక్కుల గూర్చి పోరాడుతూనే ఉమ్మడి సమస్యలయిన మార్కెట్, ముడిసరుకుల ధరల తగ్గింపు వంటి సమస్యలకు వ్యతిరేకంగా వివిధ వర్గాల ప్రజలతో కలిసి దీర్ఘకాల పోరాటాలకు సిద్ధం కావడం ద్వారా విదేశీమార్కెట్‌ను నిరోధించి స్వదేశీ మార్కెట్‌ను నిలబెట్టుకోవాల్సిన అవసరం వుంది. చేనేత, మర మగ్గాల కార్మికులను అయా సమస్యల పై సమీకరించి ఈ క్రింది డిమాండ్ల సాదనకు సన్నద్ధం చెయ్యాల్సిన అవసరముంది.

- చేనేత రంగంలో 22 రకాల రిజర్వేషన్ కాకుండా స్థానిక మార్కెట్‌లో కావల్సిన అన్ని రకాలను పూర్తిగా రిజర్వు చెయ్యాలి.
- 50 శాతం చిలుపలనూలు (హాంక్‌యార్న్) నిబంధనను మిల్లులు విధిగా పాటించేలా, 50 శాతం నూలుపై అన్ని రకాల పన్నులు సేల్స్‌టాక్స్, ఎక్సైజ్ పన్నులు వెంటనే రద్దు చెయ్యాలి.
- స్థానిక మార్కెట్‌లో మిల్లులు, విదేశీ ఉత్పత్తులు ప్రవేశించకుండా వాటిపై ఆంక్షలు విధించాలి. అధిక పన్నులు వేసి స్థానిక ఉత్పత్తుల కన్నా ఎక్కువ ధరలు ఉండేటట్లు చెయ్యాలి..
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగంలో కావల్సిన బట్టను చేనేత సొసైటీలు, మాస్టర్ వీవర్సు, మర మగ్గాలు (సిరిసిల్లా) రంగంనుండి కొనుగోలు చెయ్యాలి. మిల్లులనుండి ఆటోమేటిక్ మరమగ్గాల వారినుండి కొనుగోలు చెయ్యరాదు.
- చేనేతరంగం ఎడల గుదిబండగా తయారైన ఆప్కోను రద్దుచేసి, ప్రభుత్వ శాఖలు కార్మికులకు ఉద్యోగులకు ముందుగా డి.డి./చెక్ రూపంలో ఇచ్చి చేనేత సొసైటీల వద్ద, మాస్టర్ వీవర్ల వద్ద కొనుగోలు చెయ్యాలి.
- డబ్ల్యుటి.వో. వప్పందాన్ని అంగీకరించం. విదేశి మార్కెట్ విస్తరణను నిరోధిస్తాం.
- డబ్ల్యు.టి.వో ఒప్పందం నుండి భారత ప్రభుత్వం వైదొలగాలి.
- కేంద్ర, రాష్ట్రప్రభుత్వ కార్యాలయాల్లో, మార్కెట్ సెంటర్లలో సంతలలో చేనేత మరమగ్గాల వారికి ఉచిత షాపింగ్ సౌకర్యం కల్పించాలి.
- షెడ్ వర్కర్స్, చేనేత కార్మికులకు కనీస వేతనం అమలు చెయ్యాలి.
- చేనేత, మరమగ్గం కార్మికులకు ఉచిత విద్య, వైద్య సౌకర్యం కల్పించాలి.
- షెడ్ వర్కర్స్, ఇళ్ళులేని నేత కార్మికులకు ఉచితంగా ఇళ్ళునిర్మించాలి.
- నేత కార్మికులందరికి తెల్లకార్డులు సరఫరా చేసి కిరోసిన్, బియ్యం సబ్సిడీ ధరలకు అందించాలి.

వివిధ వర్గాల వారిని పై డిమాండ్ల సాధనకు సమీకరించి సమన్వయం చెయ్యాల్సిన కర్తవ్యం క్రియాశీల నాయకత్వం అభివృద్ధి కావడం పైనే చేనేత రంగం భవిష్యత్, కార్మికుల ఉపాధి కల్పన ఆధారపడివున్నాయి.

- కె.జె. రామారావు

# విజయవంతమైన జిల్లా సదస్సులు

గత ఆరు నెలల కాలం నుండి తీవ్రమైన చేనేత పరిశ్రమ సంక్షోభాన్ని క్రిందిస్థాయి కార్మిక వర్గం అర్థం చేసుకోవడానికి రాష్ట్ర చేనేత కార్మిక సమాఖ్య జిల్లాస్థాయిలో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది.

## మహబూబ్‌నగర్ జిల్లాలో....

మొదటగా జనవరి 8వ తేది మహబూబ్‌నగర్ జిల్లాలో పేరెన్నికగల చేనేతకేంద్రమైన గద్వాల పట్టణంలోని కొంకతి విశ్వనాథం గారి కమ్యూనిటీ హాల్‌నందు జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు వెంకట స్వామిగారు అధ్యక్షత వహించారు. జిల్లాలోని నారాయణపేట, గట్టు, కొత్తకోట, అయిజ, గద్వాల్ మొదలగు చేనేత గ్రామాల నుండి 500 మంది కార్మికులకు పైగా హాజరైనారు. కార్మికులు ప్రత్యేకత గన్న గద్వాల్ చీరలను ఇతర ప్రాంతాలవారు తక్కువ శాతం "జరీ"తో తయారు చేయడం వలన మార్కెట్‌ను కోల్పోయి సంక్షోభంలో ఉన్నట్లు చెప్పారు. ఈ విధంగా తక్కువ శాతం జరీలతో తయారు చేసే చీరెలను నివారించడానికి కార్మికవర్గం నిఘా విభాగంగా ఏర్పడి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని "గద్వాల్ చీరల ప్రత్యేకత"ను కాపాడుకోవాలని చర్చించారు. విపరీతంగా పెరిగిన సిల్కు ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. ఈ సదస్సుకు మాచర్ల మోహనరావు అధ్యక్షులు, రామకృష్ణ కన్వీనర్, రాష్ట్ర చేనేత కార్మిక సమాఖ్య హాజరైనారు. ఈ సదస్సు నిర్వహణ బాధ్యతలను గద్వాల్‌కేంద్రంలోని అక్కల సర్వానందం, వెంకటస్వామి స్వీకరించి జయప్రదం చేశారు.

## చిత్తూరు జిల్లాలో...

చిత్తూరు జిల్లాలోని నారాయణవనంలో జనవరి 20వ తేది జరిగింది. రాష్ట్ర చేనేత కార్మిక సమాఖ్య కన్వీనర్, డి. రామకృష్ణ గారి పర్యవేక్షణలో ఎ. వాసు జిల్లా వ్యాప్తంగా పర్యటించారు. అన్ని ప్రాంతాల నుండి కార్మిక వర్గాన్ని సమీకరించి "పవర్‌లూమ్స్ కేంద్రమైన" నారాయణవనంలో జిల్లా సదస్సు నిర్వహించడమనేది ప్రత్యేకత. ఈ ప్రత్యేకతకు తగ్గట్టుగానే మరమగ్గాల కార్మికులు కూడా హాజరై సదస్సును జయప్రదం చేశారు. మరమగ్గాల సంక్షోభాన్ని గూర్చి చర్చించిన ఈ సదస్సులో మరమగ్గాల కార్మికులు పాల్గొని చర్చల ద్వారా విషయాలు గ్రహించడం జరిగింది. మరమగ్గాల వారు కూడా మరల చేనేత మగ్గాలను ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్న విషయం ఈ సదస్సు ద్వారా తెలిసింది. బోగస్ సొసైటీలను గూర్చి అన్ని ప్రాంతాలనుండి విచ్చేసిన కార్మికులు తీవ్ర ఆందోళనతో చర్చలో పాల్గొన్నారు. వీటిని ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వానికి తెలియజెప్పేందుకు ఉద్యమం చేయాలనే సూచన వచ్చింది. నారాయణవనం గ్రామపెద్ద అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షులు సాంబశివయ్య సభను నిర్వహించారు. గౌరవ అతిథులుగా మాచర్ల మోహనరావు డి. రామకృష్ణగారు సదస్సులో పాల్గొని కార్మికులకు సమస్యలపట్ల అవగాహన కల్పించారు. ర్యాలీ 200 మందితో జరిగింది. బహిరంగ సభకు 500 మంది పైగా గ్రామస్థులు హాజరయ్యారు.

## ప్రకాశం జిల్లాలో...

ఇదేవిధంగా ఫిబ్రవరి 25వ తేది ఈపూరు పాలెం గ్రామంలో చేనేత కార్మిక సమాఖ్య జిల్లా సదస్సు, ప్రకాశం జిల్లాలో జరిగింది. ఈ సదస్సులో ప్రొ॥ కె. శ్రీనివాసులు ప్రపంచీకరణ చేనేతరంగం జాతీయ జౌళివిధానం అనే అంశంపై కార్మిక వర్గానికి కొన్ని విషయాలు చెప్పారు. చేనేత ఉత్పత్తులు - మార్కెటింగ్ అనే అంశంపై కె.జె. రామారావు చేనేత ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి ఉన్న అవకాశాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి చెప్పారు. ఈ జిల్లా సదస్సుకు ఈతముక్కల, అమ్మనబ్రోలు, వలపర్ల, బెస్తవారి పేట ప్రాంతాల నుండి చేనేత కార్మికులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంలకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో 400 మంది కార్మికులు పాల్గొన్నారు. గం 6.30కు బాపూజీ పార్కు ఆవరణలో బహిరంగ సభ జరిగింది. ఈ బహిరంగ సభకు నూతన అధ్యక్షులు గట్టు విజయమోహనరావు, స్థానిక సర్పంచ్ గోలి అంజలీదేవి, ప్రొ॥ కె. శ్రీనివాసులు, కే.జె. రామారావు, మాచర్ల మోహనరావు ప్రసంగించారు.

చేనేత కార్మిక సమాఖ్య జిల్లాకమిటీ/ గ్రామ కమిటీలు/ రాష్ట్ర కమిటీల సభ్యులు ఎవ్వరూ ఎన్నికలలో పాల్గొన కూడదని నిర్ణయించడం ఈ సదస్సు ప్రత్యేకత. ఉ. 9.00 గంటలకు చేనేత కార్మిక సమాఖ్య జెండా ఆవిష్కరణను గౌరవనీయులు అరెకాటి పానకాలు, చేనేత ఉద్యమనాయకులు చేశారు. చేనేత ఉద్యమనాయకులు కొలుకులవెంకట సుబ్బారావు గారిని అరెకాటి పానకాలు గారిచే సన్మానించడమైంది.

## గుంటూరు జిల్లాలో...

మార్చి 23వ తేది గుంటూరు జిల్లా సదస్సు చేనేత కేంద్రమైన ఐలవరంలో జరిగింది. ఈ సదస్సులో తట్టు యాదగిరి, లెక్చరర్, నిజాం కాలేజి, హైదరాబాద్ చేనేత సంక్షోభం - ప్రభుత్వ విధానాలు అనే అంశంపై ప్రసంగపాఠం చెప్పారు. జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన కార్మికవర్గం చేనేత సమస్యలపై చర్చించడం జరిగింది. సాయంత్రం జరిగిన ర్యాలీలో 200 మంది పాల్గొన్నారు. బహిరంగ సభకు స్థానిక ఎమ్.ఎల్.ఎ ముమ్మినేని వెంకట సుబ్బయ్య, మాజీ ఎం.ఎల్.ఎ. అంబటి రాంబాబు, సహకార సంఘాల అధ్యక్షులు, చేనేత నాయకులు పాల్గొన్నారు. 600 మందికి పైగా స్థానిక ప్రజలు పాల్గొని సభను జయప్రదం చేశారు. ఈ సదస్సును స్థానిక సహకార సంఘం అధ్యక్షులు, గ్రామ ప్రజల సహకారంతో మాచర్ల వెంకటరత్నం, జొన్నాదుల రామాంజనేయులు, చేనేత ఉద్యమనాయకులు జొన్నాదుల వెంకట్రావు గారు బాధ్యత వహించి జయప్రదం చేశారు.

# నల్గొండ జిల్లాలో రెండో స్వాతంత్ర్య పోరాటానికి పిలుపు

చేనేత కార్మికులకు జాతీయ స్వాతంత్ర్యోద్యమంతో చాలా దగ్గరి సంబంధం వుందని, జాతీయోద్యమానికి స్ఫూర్తినిచ్చిన మగ్గం, రాట్నంలతో కూడిన వృత్తి రక్షణకు నేతన్నలు సంఘటితంగా రెండో స్వాతంత్ర్యపోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందని చేనేత రంగంపై విశేష పరిశోధన చేసిన ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. భూదాన్ పోచంపల్లిలో ఏప్రిల్ 14న జరిగిన నల్లగొండ జిల్లా చేనేత మహాసభకు ప్రధానవక్తగా హాజరైన ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ బాధ్యతారహితమైన నాయకులకు, ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలని రెండో విదేశీ వస్త్ర బహిష్కరణకు, సహాయ నిరాకరణోద్యమం చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న నేత కార్మికుల ఆత్మహత్యలపై స్పందిస్తూ ఇంగ్లాండ్‌లో పారిశ్రామిక విప్లవకాలంలో సైతం నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోలేదని అటువంటిది ఆంధ్ర రాష్ట్రంలోనే ఎందుకు జరుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. చేనేత సంక్షోభం రూపంలోనూ, సారంలోనూ కారణాలలోనూ చాలా వ్యత్యాసం వుందని శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. నేతన్నలకు సామర్థ్యం, ఆత్మస్థైర్యం లేదని బాధ్యతగల మంత్రి ప్రకటించడం క్రూరమైన జోకు వంటిదేనని, ఆప్కో బకాయిలు చెల్లిస్తే సంక్షోభం తగ్గదని, వాస్తవ పరిస్థితులను గమనించి వాటి పరిష్కారం దిశవైపు ప్రయత్నాలు ప్రారంభం కావాలని ఆయన సూచించారు.

నూతన ఆర్థిక విధానాలపేరుతో ప్రభుత్వం తమ బాధ్యతల నుంచి తప్పుకో జూస్తున్నాయని వాటిని తీవ్రంగా ప్రతిఘటించడం ద్వారానే తమ హక్కులు సాధించుకునే అవకాశం వుందని శ్రీనివాసులు సూచించారు. సత్యం కమిటి రిపోర్టును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటికి కూడా ఇవ్వని ప్రభుత్వం అందులోని వాస్తవాలేమిటో చేనేత కార్మికులకు తెలియజెప్పే అవకాశమే లేదని శ్రీనివాసులు అన్నారు.

ఈ సభలో స్వతంత్ర చేనేత పరిశోధనా సంస్థ సభ్యులు కె.జె. రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం చెబుతున్న అంతర్జాతీయ మార్కెట్ డాలర్ స్వప్నంలా అందంగా కనిపించినా ఆచరణలో అనేక సమస్యలున్నాయన్నారు. విదేశీ వస్త్రాలు స్వదేశీ మార్కెట్లోకి వస్తే, స్వదేశీ మార్కెట్లో అమ్ముకునే మన వస్త్రాలకు గిరాకి తగ్గటం, విదేశాలలో గిరాకీని పొందక పోవటంతో జాతీయ చేనేత పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని, ఈ కుట్రను జాగ్రత్తగా నేతన్నలు పరిశీలించి తగినవిధంగా స్పందించాలని ఆయన సూచించారు.

ఈ సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు, మాస్టర్ వీవర్లు, సహకార సంఘాల నాయకులు సుమారు 400 మంది హాజరై వివిధ విషయాలు చర్చించారు. ఈ సభకు పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు సీత చంద్రయ్య అధ్యక్షత వహించారు. సదస్సుకు జడ్‌పి.టి.సి. సభ్యులు కొంగరి భాస్కర్, పోచంపల్లి సర్పంచ్ విడెం నర్సింహ, కార్మిక నాయకులు ఏలె బిక్షపతి, బోగ రాములు, బిక్షపతి, తదితరులు అనేకమంది ప్రసంగించారు. భోజన విరామం తర్వాత జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమాఖ్య కార్యకర్తలు పాడిన చేనేత బ్రతుకు పాటలు నేతన్నలను కదిలించాయి.

## కర్నూలు జిల్లాలో...

రాష్ట్ర చేనేత కార్మిక సమాఖ్య కర్నూలు జిల్లా సదస్సు ప్రముఖ చేనేత కేంద్రమైన ఎమ్మిగనూరు పట్టణంలో ఏప్రిల్ 30న వందలాది మంది నేతన్నల సమక్షంలో జరిగింది. ఈ సదస్సుకు కార్మికనాయకులు బండా నీలకంఠం అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో కర్నూలు ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, నందవరం రామన్న, రామలింగప్ప, తలమారి యూసఫ్ (నాగలదిన్నె), శంకరన్న, తదితరులు జిల్లా నేతన్నల సమస్యలను ప్రస్తావించారు. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం కార్మికులకు చేతినిండా పని కల్పించటంలేదని, సహకారేతర రంగంలో పని చేస్తున్నవారికి కూలీగిట్టుబాటు కావటం లేదని వాపోయారు. ప్రభుత్వ పథకాలేవీ తమదాకా రావటంలేదని, ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సదస్సులో స్వతంత్ర చేనేత పరిశోధనా సంస్థ సభ్యుడు తడ్క యాదగిరి ప్రభుత్వ విధానాలపై ప్రసంగించారు. రాజ్యాంగం ప్రజలకు జీవించేహక్కు ప్రసాదించినా నేతన్నలకు ఆ హక్కు లేకుండా పోయిందని, ఆత్మహత్యలపై స్పందించని ప్రభుత్వాలు ప్రపంచంలో ఎక్కడా లేకపోవచ్చునని, అటువంటి హైటెక్ పాలనలో మనం జీవిస్తున్నామని యాదగిరి అభిప్రాయపడ్డారు. చేనేత వ్యతిరేక విధానాలను ప్రతిఘటించకుండా నేతన్నలు తమ వృత్తిని రక్షించుకోలేరని ఆయన అన్నారు. ఈ సదస్సులో వచ్చిన మౌలికమైన ప్రశ్నలకు రాష్ట్ర చేనేత కార్మిక సమాఖ్య అధ్యక్షులు మాచర్ల మోహనరావు సమాధానాలు ఇచ్చారు. మరమగ్గాల సంక్షోభానికి చేనేత సంక్షోభానికివున్న వైరుధ్యం ఏమిటో ఆయన నేతన్నలకు అర్థమయ్యేలా వివరించారు. ఈ సభలో సమాఖ్య కార్యకర్తలు పాడిన పాటలు ముఖ్యంగా మహిళా, బాల కార్మికుల పాటలు మహిళలను, నేతన్నలను కదిలించి వేశాయి.

## వరంగల్ జిల్లాలో...

వరంగల్ జిల్లా చేనేత సదస్సు ఏప్రిల్ 16న జనగామ పట్టణం పద్మశాలి భవనంలో జరిగింది. ఈ సదస్సులో సుమారు 250 మంది నేతన్నలు వివిధ గ్రామాల నుంచి హాజరయ్యారు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల మోహనరావు సమాఖ్య పోరాట లక్ష్యాలను వివరించారు. స్వతంత్ర చేనేత పరిశోధనా సంస్థ సభ్యులు తడ్కయాదగిరి "జౌళి విధానాలు-చేనేత వివక్షత" అంశంపై ప్రసంగించారు. ఈ సదస్సులో ప్రకాశం జిల్లా సమాఖ్య అధ్యక్షులు గట్టు విజయమోహనరావు, నల్లగొండ జిల్లా సమాఖ్య అధ్యక్షులు ఏలె బిక్షపతి, సహకార సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొని తమ ప్రాంతంలోని వివిధ సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ పథకాలపై నేతన్నలకు అవగాహన కల్పించాలన్నారు.

ఇదేవిధంగా అనంతపురం, కృష్ణా, ఉభయ గోదావరిజిల్లాలో జరిగాయి. అన్ని చోట్ల బోగస్ సొసైటీల విషయాలు చేనేత సమస్యలు చర్చించబడ్డాయి. డిమాండ్స్ మాత్రం అన్ని చోట్ల ఒకటే. నూతన కార్యవర్గాలు ఏర్పడ్డాయి. ☆

# చేనేత రంగం - దాని ప్రాధాన్యత - ఉపాధి అవకాశాలు

భారతదేశంలో వ్యవసాయరంగం తరువాత ప్రధానమయిన రెండవ ఉపాధిరంగం చేనేత పరిశ్రమ. ఈ పరిశ్రమపై ఆధారపడి 38 లక్షల మగ్గాలపై 124 లక్షల మంది కార్మికులు నిరంతరం ఉపాధి పొందుతూ జీవిస్తున్నారు. చేనేత రంగంలోను వివిధ రకాల ఉపవృత్తులయిన పనులను చేస్తూ ప్రత్యక్షముగా పరోక్షముగా 4కోట్ల మంది ప్రజలు జీవిస్తున్నందున ఉపాధి ప్రాధాన్యతా రంగంగా భారతదేశంలో బ్రిటిష్ కాలం నుండి నేటివరకు చేనేత పరిశ్రమ గుర్తింపు కలిగి ఉంది. అంతేగాక అన్ని మతాల ప్రజలు వివిధ కులాలకు సంబంధించిన ప్రజలు ఈ రంగంపై ఆధారపడి జీవించటం వలన చేనేత పరిశ్రమ మరొక ప్రత్యేకతను సంతరించుకొన్నది. దేశం మొత్తం మీద 4,56,000 మంది షెడ్యూలు కులములవారు, 9,50,000 మంది షెడ్యూలు తెగలకు సంబంధించిన వారు చేనేత మగ్గాలపై పనిచేస్తూ, వీటిపై ఆధారపడి మొత్తం 1 కోటి 20 లక్షల మంది ప్రజలు చేనేత రంగంలోని వివిధరకాల ఉపవృత్తులపై ఆధారపడి జీవించటం మరొక ప్రత్యేక అంశంగా గుర్తించాల్సి ఉంది. ఈ విధంగా ఉపాధి పొందుతున్నటువంటి షెడ్యూలు కులాలు లేదా తెగలకు సంబంధించి ఒరిస్సాలో బడాయి/బరాయి, మధ్యప్రదేశ్‌లో బలాహి బలాయి, చెదర్ అతియా, చీక్ చైక్వా, ఒరిస్సాలో చెంద్లా, బీహార్ లో చౌపల్, బసక్, తాంతి, పంజాబ్‌లో ధోద్రి, కబిర్‌పంతి, గుజరాత్‌లో ధాంగ్‌షయర్, హిమాచల్ ప్రదేశ్‌లో జోలాహా, మహారాష్ట్రలో మంగ్, రాజస్థాన్‌లో మెహర్, పశ్చిమ బెంగాల్ పాన్, ఆంధ్రప్రదేశ్‌లో పమిడి, బీహార్‌లో పనాసి, ఒరిస్సాలో పట్టియార్, పంకా కేరళలో కక్కలన్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో ఖోరి కోలి, మొదలగు కులాలకు సంబంధించిన వారు చేనేత రంగంపై ఆధారపడుతున్నారు.

> 1974 శివరామన్ కమిటీ తన రిపోర్టులో ఒక పవర్‌లూం 12 మంది చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బ తీస్తుందని చెప్పి, చేనేత మగ్గముపై తయారయ్యే ఉత్పత్తులను చేనేత వర్గాలకు కేటాయించి చట్టబద్ధత కల్పించాల్సిందిగా స్పష్టం చేసింది.

## చేనేతరంగ సంక్షోభం - ఆత్మ హత్యలు కారణాలు - నేపథ్యం

1928 రాయల్ కమీషన్ రిపోర్టు, 1942 నిజనిర్ధారణ కమిటీ రిపోర్టు, 1945 ఆల్ ఇండియా హాండ్‌లూమ్ బోర్డు ఏర్పడటం, 1954 కనుంగో కమిటి (టెక్స్‌టైల్ ఎంక్వయిరీ కమిటీ), 1946 మరియు 1956లో ద ఇండ్రస్ట్రియల్ పాలసీ రిసల్యూషన్ ఇచ్చిన రిపోర్టు 1955 లో కార్వే కమిటి ఇచ్చిన రిపోర్టు, 1973-74 లో శివరామన్ హై పవర్ కమిటీ రిపోర్టు - వీటన్నింటిలో కూడా చేనేత పరిశ్రమ ఆధారపడి గ్రామీణ భరతావనిలో కోట్లాది మంది ప్రజలు ఉపాధి పొందుతూ జీవిస్తున్నందున చేనేత రంగాన్ని కాపాడటం కోసం పవర్ లూమ్, కాంపోజిట్ మిల్లుల యాంత్రీకీకరణలో వస్తున్న పెను మార్పులను దృష్టిలో పెట్టుకొని చేనేత పరిశ్రమకు మిల్లు రంగానికి ఉన్న వైరుధ్యాన్ని క్షుణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోపోతే కోట్లాది మంది ప్రజల జీవన భద్రతతో కూడిన ఉపాధి రంగం కుంటుపడటమే కాక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై ఊహించటానికి వీలు లేని చెడు ప్రభావాలకు దారి తీస్తుందని, అందువలన చేనేత పరిశ్రమను కాపాడటానికి ప్రభుత్వపరమైన సామాజిక తోడ్పాటును అందించాలని చాలా స్పష్టంగా పైన తెలిసిన రిపోర్టులన్ని తమ నివేదికలో తెలుపుట జరిగింది. అంతే గాక 1974 శివరామన్ కమిటీ తన రిపోర్టులో ఒక పవర్‌లూం 12 మంది చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తుందని చెప్పి, చేనేత మగ్గముపై తయారయ్యే ఉత్పత్తులను చేనేత వర్గాలకు కేటాయించి చట్టబద్ధత కల్పించాల్సిందిగా మొట్టమొదటి సారిగా స్పష్టంగా ప్రభుత్వానికి నివేదించటం జరిగింది.

కాని భారత ప్రభుత్వము 1942 కు తదుపరి 1974 శివరామన్ కమిటి రిపోర్టు ఇచ్చిన నివేదికలను అనుసరించి చేనేత రంగాన్ని కాపాడటం కోసం ఎటువంటి చర్యలు తీసుకోక పోగా పవర్ లూమ్స్ పై చేనేత వారి ఉత్పత్తులను నిరాటంకంగా తయారు చేయటానికి దోహద పడ్డాయి. ఈ మధ్యకాలంలోనే చేనేత రంగంలో వచ్చే సంక్షోభాలను తట్టుకోలేక పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది మంది ప్రజలు దేశములోని వివిధ ప్రాంతాలలో తమ శక్తి కొలది అనేక రూపాలలో ఉద్యమాలు నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అరకొర నిధులను కేటాయించి సబ్సిడీపై నూలు అమ్మకం కేంద్రాలను, ఆకలితో అలమటిస్తున్న కార్మికులకు గంజి కేంద్రాలను ఏర్పాటు చేసి తాత్కాలిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. (1952 నుండి 1965 మధ్యకాలంలో).

ఈ విధమయిన నూలు కొరత, చేనేత ఉత్పత్తులకు పవర్ లూమ్ బట్టల మార్కెట్ వాటి సంక్షోభాల తరుణంలోనే కేంద్ర ప్రభుత్వం నూతన జౌళి విధానాన్ని 1985 లో ప్రవేశ పెట్టింది. ఈ 1985 పాలసీ చేనేత కార్మికులను అనేక విధాలుగా నష్టపరిచే

విధానాలను రూపొందించి 50శాతము చిలపల నూలు తయారు చేయాలనే చట్టం, 22 రకాల చేనేత ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించి చేనేత కార్మికులను భ్రమింపచేయటం ద్వారా చేనేత రంగం యొక్క క్షీణదశకు కేంద్ర ప్రభుత్వ విధానాలు దోహద పడ్డాయి. ఈ క్షీణదశ 1985 వరకు ఉన్న 48 లక్షల చేమగ్గాలను ఒక్క సంవత్సర కాలంలో (1986 నాటకి) 43 లక్షల మగ్గాలకు తగ్గటానికి కారణమైంది. నూలు కొరతతో పాటు రంగుల రసాయనాల ధరలు విపరీతంగా పెరగటం అంతేకాక 1985 నూతన జౌళి విధానం వలన పవర్‌లూమ్ ఏర్పాటుకు సంభందించి నిబంధనలను సవరించుట వలన చెప్పటానికి వీలులేనంత సంక్షోభాన్ని చేనేత రంగం చవి చూడవలసి వచ్చింది ఈ 1985 పాలసీ చేనేత రంగాన్నే కాకుండా దీనికి ప్రాణాధారమయిన ప్రత్తి రైతాంగాన్ని కూడా సంక్షోభంలోకి నెట్టివేసింది. విపరీతంగా విదేశాల నుండి నూలును, ముడి పత్తిని దిగుమతి చేసుకోవటానికి 1985 జౌళి విధానం ఆంక్షలు తొలగించటం వలన పత్తి రైతాంగం గిట్టుబాటు ధరలు లేక పెట్టుబడులు రాక బ్యాంకుల రుణాలు చెల్లించలేని స్థితికి నెట్టబడి ఆస్తులను జప్తుచేసే పరిస్థితులు ఏర్పడటంతో 1986-87 సంవత్సరంలో ప్రత్తి రైతాంగం మొట్టమొదటిగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. (పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట ప్రాంతాలలో) ప్రత్తి రైతుల ఆత్మహత్యలను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం విపరీతంగా ప్రత్తిని ఎగుమతి చేయటానికి లైసెన్సులు ఇవ్వటం వలన స్వదేశంలోకి నూలు మిల్లులకు ప్రత్తి కొరత ఏర్పడి నూలు మిల్లు కార్మికులు ఉపాధి కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి ఈ ఎగుమతుల వలన నూలు రేట్లు విపరీతముగా పెరిగి పెరిగిన నూలు ధరలకు అనుగుణంగా మార్కెట్లో ఉత్పత్తులకు ధరలు లభించక చేనేత కార్మికులు వేతనాలు తగ్గించుకొనుటే ఘోర్గంగా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితి 1986 నుండి 1991 వరకు కొనసాగింది. ఈ దశలోనే చేనేత కార్మికుల రోజువారి పనితో సంపాదిస్తున్న వేతనాలు దినసరి నిత్యావసర వస్తువుల ధరలకు చాలక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ, అర్ధాకలితో అలమటిస్తు జీవితాలను గడపటం జరిగింది. సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో, విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించాలనే తపనతో మనదేశంలో పండే పత్తిని, తయారయ్యే నూలును విదేశాలకు ఎగుమతి చేస్తూ విదేశాల నుండి దిగుమతి చేసుకొనుచున్నటువంటి జౌళి యంత్రాలపై దిగుమతి సుంకం తగ్గించుట వలన 1986 నుండి 91 వరకు మధ్యగల కాలంలో చేనేత కార్మిక వర్గం ఊపిరి సలపని సంక్షోభాలకు గురై తట్టుకోలేని స్థితిలో 1988-1991 సంవత్సరాలలో 150 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకొన్న విషయం తెలిసిందే, ఈ తరుణంలోనే కోస్తా ప్రాంతంలో చేనేత కార్మికోద్యమం రాజకీయ పార్టీలకు అతీతంగా కొనసాగి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు చీరాలకు వచ్చి కార్మిక వర్గ ప్రతినిధులతో చర్చించి చేనేత వర్గ సంక్షేమం కోసం, చేనేత పరిశ్రమ రక్షణ కోసం తీసుకోవలసిన చర్యలను నిర్ణయించటం జరిగింది. అయినప్పటికి కేంద్రప్రభుత్వం డిసెంబరు 3, 1991లో పార్లమెంటు నిండు సభలో చేనేతకు ప్రకటించిన రక్షణ చర్యలను గాని సంక్షేమ పథకాలను కాని చిత్తశుద్ధితో అమలు చేయకపోవటం వలన సమస్య తీవ్రత కొనసాగుతూనే ఉన్నది. ఈ సమస్య తీవ్రతకు ప్రధానమయిన కారణం మనదేశ జౌళి రంగాన్ని సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో విదేశీ పారిశ్రామిక వేత్తలకు, స్వదేశీ దళారీ పెట్టుబడీ దారులకు దారాదత్తం చేయుట కొనమే అనేది నగ్న సత్యం. దీనిని విదేశాలనుండి మన దేశానికి దిగుమతి అయిన టెక్స్టైల్ మిషనరీ విలువలను పరిశీలించక, 1985-86 నాటికి మనదేశం నుండి ఎగుమతి అయినటువంటి యంత్రాల విలువ 24 కోట్ల 22 క్షలు. ఇదే కాలంలో యంత్రాల దిగుమతులు అసలు లేనేలేదు. నూతన జౌళి విధానం 85 తరువాత మనదేశానికి దిగుమతులు 1986-87లో 250 కోట్లకు చేరింది. 1986-87 కాలంలోనే మన ఎగుమతులు 34 కోట్లు మాత్రమే. ఇదేవిధంగా 1992-93 నాటికి మనదేశంనుండి జౌళి యంత్రాల ఎగుమతులు 150 కోట్లు ఉండగా విదేశాల నుండి దిగుమతి అయిన జౌళియంత్రాల విలువ. 750 కోట్లు ఉన్నది. 1999-2000 మన దేశ జౌళి యంత్రాల ఎగుమతులు 200 కోట్లు కాగా విదేశాలనుండి దిగుమతి అయిన యంత్రాల విలువ 1600 కోట్లు అయినది. ఈ విధముగా దిగుమతి అయిన విదేశీ యంత్రాలకనుగుణంగా, మన దేశంలో పండే పత్తి, మనదేశంలో తయారయ్యే నూలు లేనందుకు, అనివార్యంగానే విదేశాలనుండి పత్తిని, నూలును దిగుమతి చేసుకొని వస్త్ర ఉత్పత్తి జరపాల్సివచ్చింది. దీని ఫలితంగానే 1999-2000 మధ్యకాలంలో మన రాష్ట్రంలో పత్తి రైతాంగం కొన్ని వందల మంది ఆత్మహత్యలకు

విదేశాల నుండి దిగుమతి చేసుకొనుచున్నటువంటి జౌళి యంత్రాపై దిగుమతి సుంకం తగ్గించుట వలన 1986 నుండి 91 వరకు మధ్యగల కాలంలో చేనేత కార్మిక వర్గం ఊపిరి సలపని సంక్షోభాలకు గురై తట్టుకోలేని స్థితిలో 1988-1991 సంవత్సరాలలో 150 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకొన్న విషయం తెలిసిందే,

గురికావటం జరిగింది. ఈ విధమయిన యంత్రాల దిగుమతి, ప్రత్తి, నూలు దిగుమతి వలన స్వదేశంలోని ప్రత్తి రైతాంగం, ఆత్మహత్యలకు గురికాగ, మన దేశంలోని జౌళి మిల్లులోని లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధులపాలయ్యారు. కాటన్ అడ్వయిజరి బోర్డు 18-7-2000 లెక్కల ప్రకారం మనదేశం నుండి 97.59 లక్షల బేళ్ళు పత్తిపండగా 11.90 లక్షల బేళ్ళ పత్తిని ఎగుమతి చేయటం జరిగింది. ఇదేకాలంలో మనదేశ అవసరాలు 117 లక్షల బేళ్ల పత్తి అవసరం అయింది. 1999-2000 అక్టోబర్-సెప్టెంబరు మధ్యకాలం నాటికి 19 లక్షల బేళ్ల పత్తిని ఎగుమతి చేసి మనదేశంలో నూలు మిల్లులకు కావలసిన ముడిపత్తి కొరతను ఏర్పరచటం వలన వందల సంఖ్యలో నూలు మిల్లులు మూతపడటం జరిగింది. ఈ విధంగా 1985 జౌళి విధానం పరిశ్రమను అభివృద్ధి చేయకపోగా జౌళి పరిశ్రమలను మరింత క్షీణ దశకు నెట్టి వేయబడి లక్షలాది మంది కార్మికులు నిరుద్యోగులై బజారు పాలు అయ్యారు. ఈ విధంగా ప్రభుత్వ లెక్కల ప్రకారమే 1985 నుండి 1999 మార్చినాటికి 2357 టెక్స్టైల్ యూనిట్స్ మూతపడి, 13,113 కోట్ల 87 లక్షల రూపాయలు వివిధ ఆర్థిక సంస్థలకు బకాయి ఉన్నాయి. ఈ మిల్లులో ఉపాధి పొందుతున్న కార్మిక వర్గం 70 వేలమంది నిరుద్యోగులుగా మిగిలిపోయారు.

ఈవిధంగా 1985 నూతన జౌళి విధానం అమలుపరిచి 15 సంవత్సరాల కాలంలో వచ్చినటువంటి ఉపాధి ఆర్థిక రంగాల నష్టాలను విశ్లేషించుకోకుండా ప్రపంచ పెట్టుబడి దారి నియంతృత్వానికి కట్టుబడి ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి మన దేశ జౌళి రంగాన్ని అభివృద్ధి చేయడమనే పేరుతో యస్.ఆర్. సత్యం నేతృత్వంలో జాతీయ జౌళి విధానం-2000 ప్రకటించబడి మనదేశ జౌళిరంగాన్ని తీవ్ర సంక్షోబంలోకి నెట్టటమే కాక దేశంలోని ప్రకృతి సంపదతో పాటు మానవ వనరులను కూడా దోచుకుంటూ కోట్లాది మంది ప్రజల జీవనాన్ని హరింపచేసి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తన వికృత రూపాన్ని చూపిస్తూ పెనురక్కసిలా మనదేశ పీడితకులాల జీవనోపాధిని దెబ్బతీయటం కోసం జాతీయ జౌళి విధానం రూపొందించబడినదనే నగ్న సత్యాన్ని గుర్తించాలి.

ఈ జాతీయ జౌళి విధానం-2000 లో పత్తి నూలు, గార్మెంట్స్, టెక్టైల్ మిషనరీ దిగుమతులకు సంబంధించి ఎటువంటి ఆంక్షలు లేకుండా వుండటం అనేది మనదేశ జౌళి రంగాన్ని సామ్రాజ్యవాద పెట్టుబడిదారులకు దారాదత్తం చేయటమే.

> **జాతీయ జౌళి విధానం-2000 లో పత్తి నూలు, గార్మెంట్స్ టెక్స్టైల్ మిషనరీ దిగుమతులకు సంబంధించి ఎటువంటి ఆంక్షలు లేకుండా వుండటం అనేది మనదేశ జౌళి రంగాన్ని సామ్రాజ్యవాద పెట్టుబడిదారులకు దారాదత్తం చేయటమే.**

అందులో బాగంగానే టెక్నాలజీ అప్గ్రేడేషన్ పేరుతో 25,000 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం కేటాయించటం జరిగింది. ఈ నిధుల ద్వారా అతి పేద చేనేత కార్మికుడి నుండి ఒకటి, రెండు పవర్ మగ్గాలు కలిగిన పవర్లూమ్స్ వారు సైతం అభివృద్ధి చెందవచ్చని చెబుతున్నప్పటికి సారంలో అవి దళారి పెట్టుబడిదారులకు బహుళజాతి సంస్థలకు మాత్రమే ప్రయోజనకరమనేది నగ్న సత్యం. ఎందువలనంటే ఈ నిధులను రాష్ట్ర ఆర్థిక సంస్థలైన సిడ్బి, నాబార్డ్, జాతీయ బ్యాంకులు వంటి లాంటి ఆర్థిక సంస్థలు కోట్లాది రూపాయలు నిధులను గ్యారంటీ చూసి మాత్రమే విడుదల చేస్తున్నాయి. ఈ విధమయిన గ్యారంటీలను వందల, వేల ఎకరాలున్న భూస్వాములు, లేదా లక్షల, కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టగల వారు మాత్రమే తమ వంతు వాటాధనాన్ని చూపి ఈ పథకాన్ని పొందగలుగుతారు. లక్షలాది మంది ఇల్లు, స్థలము వృత్తి పరికరాలే లేనటువంటి చేనేత రంగం పై ఆధారపడి జీవించే పేద జనం లేదా ఒకటి రెండు పవర్ లూమ్స్ కలిగినటువంటి పేదలు ఈ పథకాలను ఏ మాత్రం అందివుచ్చుకోలేరు. కాబట్టి ఆధునీకరణ కింద కేటాయించిన 40 వేల కోట్ల నిధులు, టెక్నాలజీ అప్గ్రేడేషన్ కింద కేటాయించిన 25,000 కోట్లు మనదేశంలోని లక్షలాది మంది చేనేత కార్మికులకు కాని, వేలాది మంది పవర్లూమ్ కార్మికులకు కాని ఉద్దేశించినది కాదని మనం గుర్తించాలి. ఇవి కేవలం విదేశీ పెట్టుబడులతో ముందుకొస్తున్న బహుళజాతి సంస్థలకు, లేదా వారి ఏజెంట్లుగా స్వదేశంలో ఉన్న దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడటం కోసమే నని గుర్తించాల్సిన అవసరం ఉంది. ఈ విధంగా ప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రపంచీకరణను అమలు చేస్తూ మనదేశ రాజకీయ, ఆర్థిక విధానాలపై పెత్తనాన్ని చెలాయిస్తూ, మన దేశ సార్వభౌమాధికారాన్ని కబళించి వేయటానికి దానితో పాటు ఆర్థిక స్వావలంబన క్షీణింపచేసి, మన దేశాన్ని తాకట్టు నుండి కొనుగోలు చేయుటకోసం తమకు అనుకూలమయిన వాతావరణాన్ని ఏర్పాటు చేసకోవటంలో భాగంగానే జాతీయ జౌళి విధానం - 2000ను మన దేశ పాలకులయిన దళారీ బూర్జువాలు, పెట్టుబడిదారులు రూపొందించటం జరిగింది.

## జాతీయజౌళి విధానం, సత్యం కమిటీ - చేనేత పరిశ్రమ మనుగడ.

సత్యం కమిటి తన రిపోర్టులో చేనేతకు కేటాయించిన 50%

చిలపలనూలు నిభంధనలను సడలించి నూలుమిల్లులన్ని కోన్‌యార్న్ తయారు చేయటం ద్వారా ఆర్థిక పరిపుష్టి కల్పించవచ్చుని చెప్పటం జరిగింది. నూలు మిల్లులు చిలపలనూలు తయారు చేయటం వలనే నష్టాల ఊబిలో కొట్టు మిట్టాడు తున్నాయని అందువలన చిలపలనూలు తయారు చేయాలనే నిభంధనతో కూడిన చట్టాన్ని తీసివేయాలని చెప్పారు. ఈ విధముగా చిలపలనూలు పేదచేనేత కార్మిక వర్గానికి అందుబాటులో లేకుండా చేసి లేదా నూలు కొరత ఏర్పరచడం వలన అధిక రేట్లకు నూలును కొనాల్సిన పరిస్థితి ఏర్పరచి పారిశ్రామిక వేత్తలకు లాభాలను చేకూర్చే ఉద్దేశముతో ఈ సిఫార్సులు చేయటం జరిగింది. అంతేకాక 1985 జౌళివిధానంలో చేనేత పరిశ్రమ రక్షణ కొరకు కేటాయించిన 22 రకాల చేనేత రిజర్వేషన్ ఉత్పత్తి రకాలను తొలగించకపోతే ప్రపంచ మార్కెట్‌లో జౌళి రంగంలో మన వాటాని పెంపొందించుకోలేమని, అందువలన పవర్‌లూమ్స్, కాంపోజిట్ మిల్లులు కూడా చేనేతకు కేటాయించిన ఉత్పత్తి రకాలను తయారుచేయుటకు అనుమతించాలని, ఈ విధంగా భారత ప్రభుత్వం చేయగలిగినపుడు మాత్రమే ఐదు బిలియన్ డాలర్ల ఎగుమతి నుండి 50 బిలియన్ డాలర్ల ఎగుమతుల వరకు మన జౌళి ఉత్పత్తులను పెంపొందించవచ్చుని పారిశ్రామిక వేత్తల రక్షణ కోసం గావు కేకలు పెడుతున్నారు. అంతటితో ఆగక మనదేశంలో సాధారణ నేత నేసే వారందరిని పవర్‌లూమ్స్ రంగానికి మార్చాలని అందుకు ప్రత్యేక పథకాలను అమలు చేయాలని మరొక సూచన చేశారు. ఈ సూచన ఒక్కటే భారతదేశ జౌళి రంగాన్ని సర్వనాశనం చేస్తుంది. ఎందువలనంటే మనదేశంలో ఉన్న 38 లక్షల మగ్గాలలో సగానికిపైగా సాదా ఉత్పత్తులు నేసేటటువంటి మగ్గాలు. వీళ్ళ నెలసరి ఆదాయం చాలా తక్కువని, వీళ్ళ ఆదాయనికి 800 నుండి 3000లకు పెంపొంధించాలంటే పవర్‌లూమ్స్‌లోకి మారటం తప్ప మరో మార్గం లేదని శ్రీ యస్. ఆర్. సత్యం చెప్పారు. ఈ విధమయిన విభజనను ఉత్పత్తి సాధనాలను బట్టి కాకుండ ఉత్పత్తి రకాలను బట్టి చేనేత కార్మికుల యొక్క జీవన ప్రమాణస్థాయిని నిర్దేశించటమనేది సరైన పద్ధతి కాదు. చేనేత రంగంలో ఉత్పత్తి అయిన వస్త్రాల విలువ, కార్మికుని యొక్క అదనపు శ్రమతో కూడినదనే విషయాన్ని గమనించాలి. ఈ విధముగా అవగాహనా లోపముతో కూడిన సత్యం కమిటి సిఫార్సుల వలన 57 లక్షల మంది ప్రజానీకాన్ని 5 లక్షల మర మగ్గాలను ఏర్పరచి లక్షమందికి మాత్రమే ఉపాధి కల్పించే హేయమయిన ప్రతిపాదనలను

అవగాహనా లోపముతో కూడిన సత్యం కమిటి సిఫార్సుల వలన 57 లక్షల మంది ప్రజానీకానికి 5 లక్షల మర మగ్గాలను ఏర్పరచి లక్షమందికి మాత్రము ఉపాధి కల్పించే హేయమయిన ప్రతిపాదనలను తిరస్కరించక తప్పదు.

తిరస్కరించక తప్పదు. చేనేత కార్మికుల జీవన ప్రమాణస్థాయి పెంపుదల పేరుతో జరుగుతున్న ఈ కుట్రను వ్యతిరేకించాలి. ఎందువలనంటే మనదేశ జౌళి రంగములోని ఉత్పత్తి ఎగుమతులలో మరియు దేశీయ మార్కెట్‌లో కూడా పోటీని ఎదుర్కొం టున్నది ఈ సాదా వస్త్రాన్ని తయారు చేసే చేనేత కార్మికుడే. అది ఎలాగంటే భారతదేశ వస్త్ర పరిశ్రమలో వస్తున్నటువంటి మార్పులలో, స్క్రీన్ ప్రింటింగ్, ఎంబ్రాయిడరీ, బాతిక్ ప్రింటింగ్ ముఖ్యమయినవి. ఈ రంగాలలో ఉపయోగించేది అధిక శాతం సాదా నూలు వస్త్రం మాత్రమే అందునా చేనేత వస్త్రం అధిక శాతం. అందువలన సాదా వస్త్రాన్ని తయారు చేసే నేత వస్త్రాలను పవర్‌లూమ్స్‌కు మార్చాలనే సాకుతో అసలు రహస్యాన్ని దాచేస్తున్నారు. తద్వారా స్వదేశీ మార్కెట్‌లో చేనేత వస్త్రాలకున్న మార్కెట్ వాటాను కొల్లగొట్టటానికే ఈ విధమయిన సిఫార్సులను యస్.ఆర్. సత్యం చేయటం.

యస్.ఆర్ సత్యం కమిటి సిఫార్సుల వలన కుటీర పరిశ్రమగా ఉన్న చేనేత పరిశ్రమ చిన్నాభిన్నమై సర్వనాశనం అవుతుంది. ఎందువలనంటే చేనేత కార్మికులు ఇప్పటివరకు మన ఇండ్ల వద్ద చేసుకొనుచున్న ఉపవృత్తుల పద్ధతిని తొలగించి చేనేత కార్మికుల సముదాయముగా ఒకే చోట నూతన టెక్నాలజీ ద్వారా వార్పింగ్, సైజింగ్, వెట్ ప్రాసెసింగ్ చేసి ఖర్చును తగ్గించి నాణ్యతను పెంచాలని సూచించటంలో అంతర్జాతీయ కుట్ర దాగిఉంది. శతాబ్దాల కాలం నుండి కొనసాగుతున్న సాంప్రదాయ పద్ధతి ద్వారా వార్పింగ్, సైజింగ్, వెట్ ప్రాసెసింగ్ చేయటం వలన చేనేత బట్ట పవర్‌లూమ్ మిల్లులలో తయారయిన బట్టకంటే ఎక్కువ నాణ్యత కలిగి ఉన్నదని అహ్మోదాబాద్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ రీసెర్చ్ అసోసియేషన్ వారు లేబరేటరీలో పరిశీలించి చెప్పిన విషయం సత్యం గారికి తెలియదేమో. సాంప్రదాయ పద్ధతులు అవలంబించటం వలన నూలు దారానికి అదనపు శక్తిని కలిగి ఉండటం విదేశీయులు కూడ గుర్తించారు. అది ఒక్క భారత దేశంలోని ఆంధ్రరాష్ట్రంలోనే ఇప్పటికీ కొనసాగుతున్న విషయం గమనార్హం. ఉదా ॥ 40 నెం. కౌంటు దారముతో తయారయిన మిల్లు వస్త్రం, చేతిసంచి 10 కిలోల బరువు మోయగలిగితే, చేనేత వస్త్రం 14 కిలోల బరువు మోయగలదు. అదే విధముగా మిల్లులో తయారయిన లుంగీ 6 నెలల కాలములోనే చిల్లులు పడితే, చేనేత లుంగీ 2 సంవత్సరములు దాకా ఎటువంటి చిల్లులు లేకుండా

మన్నికగా ఉండగలదు. అంతేకాక ఫ్రీ లూం ప్రాసెసింగ్ పద్ధతిని ఒక కేంద్రంగా ఏర్పాటు చేయటం అనేది పెట్టుబడీ దారి విధానాన్ని సూచించటమే కాక కుటీర పరిశ్రమ పద్ధతిలో జీవిస్తున్న కార్మికులను శ్రమశక్తి అమ్ముకునే కూలీలుగా మార్చి శ్రమను సరుకుగా అమ్ముకునే స్థితికి దిగజారుస్తున్నారు. కంప్యూటర్ పేరుతో అనువంశిక ఉత్పత్తి దారులైన చేనేత కార్మికుల చేతి నైపుణ్యతను వారి మేధాసంపత్తిని డిజైన్‌ను తయారు చేయటంలో నిర్వీర్యం చేసి తద్వారా మార్కెట్ సౌకర్యాలను కబళించడం కోసం కుట్రతో చేసిన సిఫార్సులని చెప్పక తప్పదు. ఎందువలననంటే చేనేత మగ్గంకంటే ముందుగా పవర్‌లూమ్స్ లేదా మిల్స్ ఎటువంటి కొత్త డిజైన్‌లు మార్కెట్‌లో ప్రవేశపెట్టి ఉండదు. అవి చేనేత డిజైన్‌లను డూప్లికేట్ చేస్తు వస్తున్నవే. మనదేశ చేనేత వస్త్రముల డిజైన్‌లను తట్టుకొనలేక 300 సంవత్సరాల క్రితం ఇంగ్లాడులో ఆర్టిజాన్ కాంప్లెక్స్‌లను ఏర్పాటుచేసి శిక్షణ ఇచ్చిన చరిత్ర మన దేశ చేనేత కళాకారుల మేధోశక్తిని రుజవు చేస్తున్నాయి. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొంటు చేనేత ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యాన్ని కల్పించే బాధ్యతను స్వీకరించకుండా ప్రపంచ మార్కెట్‌లో వస్తున్న పోటీని తట్టుకోవడటం కోసం నాణ్యత ప్రమాణాలను పాటించాలని అందుకు ప్రతిదశలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని అప్పుడు మాత్రమే చేనేత కార్మికులు జీవనోపాధితో పాటు అభివృద్ధి చెందగలుగు తారని చెబుతూ సబ్సిడీలను తగ్గిస్తూ భారత ప్రభుత్వం సంక్షేమ రాజ్యం అనే పదానికి తిలోదకాలు ఇచ్చింది. అందువలన దేశంలో 15-20 శాతం మంది కార్మికులు మాత్రమే సహకార రంగంలో ఉన్నారని చెప్తూనే సముదాయాల ద్వారా చేనేత కార్మికులకు టెక్నాలజీని అందించి అభివృద్ధి చేయాలనేది బూటకమే. కాక కుటుంబ సహచరులతో వృత్తి చేసుకొని జీవిస్తున్న చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెరకగపోగా సొంత ఉత్పత్తి సాధనాలను వదులుకొని ఉత్పత్తి క్షేత్రాలకు కూలీలుగా వెళ్ళవలసిన పరిస్థితి వస్తుంది. ఈ విధముగా ఇప్పటికే 1985 నుండి 2000 నాటి వరకు ఒక్క ఆంధ్రరాష్ట్రములోనే 80 వేల మంది కార్మికులు వేతన కూలీలుగా మాస్టర్ వీవర్స్ వద్ద వర్క్ షెడ్‌లలో పనిచేస్తున్నారు. వీళ్ళనే షెడ్ వర్కర్స్ అంటారు. నిజానికి చేనేత రంగానికి సంక్షోభం వచ్చినప్పుడల్లా ఆకలి అనారోగ్యచావులకు, ఆత్మహత్యలకు బలి అవుతున్నది అధికంగా ఈ వర్గానికి చెందిన వాళ్ళే. 1988-1991 చేనేత ఆకలి చావులలోను 2001 ఏప్రిల్‌లో, మెదక్‌లో దుబ్బాకలో జరిగిన ఆకలి చావులను, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన ఆకలి చావులలోను, ఈ మగ్గము ఇల్లులేని నిరాధారులైన చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోదు.

1985 టెక్స్‌టైల్ పాలసీ తరువాత రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న చేనేత పరిశ్రమ క్షీణించి ఉత్పత్తి రకాలను బట్టి 91 నాటికి కొన్ని చేనేత కేంద్రీకృతమయిన ప్రాంతాలకే పరిమిత మయినది.

1985 టెక్స్‌టైల్ పాలసీ తరువాత రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న చేనేత పరిశ్రమ క్షీణించి ఉత్పత్తి రకాలను బట్టి 91 నాటికి కొన్ని చేనేత కేంద్రీకృతమయిన ప్రాంతాలకే పరిమిత మయినది. ఈ దశలోనే ఉభయ గోదావరి జిల్లాల నుండి కృష్ణా జిల్లాలోని పెడన, గూంటూరు జిల్లాలోని మంగళగిరి, ప్రకాశం జిల్లాలోని చీరాల, నెల్లూరులోని వెంకటగిరి ప్రాంతాలకు 10 వేల కుటుంబాలు వలస రాగా 20 వేల కుటుంబాలకు పైగ మదనవాకం, ఆరణి, కాంచీపురం మొదలగు తమిళనాడు రాష్ట్రానికి సంబంధించిన ప్రాంతానికి వలస వెళ్ళారు. ఈ వలసలను నివారించి తక్షణ ఉపాధి అవసరాలను కల్పించవలసిందిగా ఎన్నిసార్లు స్వర్ణాంధ్ర ముఖ్యమంత్రిగారికి విన్నవించినను చేనేత కార్మికుల వలస బిక్షాటనలను కొనసాగించటానికి నిర్ణయం తీసుకొని ఒక్క పైసా కూడా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించకుండా చేనేత కార్మికుల ఆత్మహత్యలకు, ఆకలి చావులకు కారణమయ్యారు కాబట్టి మన రాష్ట్రంలో జరిగిన ఆకలి చావులు, ఆత్మహత్యలన్ని కూడా ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా చేసినవేనని చెప్పక తప్పదు.

జాతీయ జౌళి విధానం - 2000 వలన మూడవ తరగతి చేనేత వర్గం (సాదా వస్త్రం తయారీ వారు) వారేకాక, మొదట శ్రేణి చేనేత కార్మికులు (కాంచీపురం, ధర్మవరం, గద్వాల్, పోచంపల్లి టైఅండ్‌డై) మొదలగు ప్రాంతాల ఉత్పత్తుల వారు రెండవ శ్రేణి చేనేత కార్మికులు (టేబుల్ క్లాత్, బెడ్‌షీట్, డోర్‌కర్టన్, వాల్‌హాంగ్స్) మొదలగు ఉత్పత్తి రకాలు తయారు చేయు ప్రాంతాలు కూడా) సంక్షోబానికి గురైనారు. ఈ రోజు టై అండై డై, స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా (అరవింద్ మిల్స్) డూప్లికేట్ కాబడుట వలన వేల రూపాయల వ్యత్యాసముతో చీరలు అతితక్కువ ధరకు లభ్యమవుతున్నాయి. ఈ పోటీవలన నల్గొండ, వరంగల్, మెదక్ జిల్లాలలోని 80 వేల మగ్గాలు సంక్షోభంలో కొట్టు మిట్టాడటం వలన ఈ ఉత్పత్తి రకాలు నేసేటటువంటి దుబ్బాక లోని చేనేత కార్మికులు ఆత్మహత్యలకు గురైన విషయం మనం గుర్తించాలి. ప్రాంతాల వారి ప్రత్యేకతను సంతరించుకున్న ఉత్పత్తి రకాలు, కుప్పడం, జాకార్డు, టై అండ్ డై, పట్టు ఆయా ప్రాంతాల నుండి వికేంద్రీకరించబడి మరొక చోట ఉత్పత్తులు చేయటం వలన కూడా చేనేత సంక్షోభం మన రాష్ట్రంలో గతంలో కొన్ని చోట్లకే పరిమితం అయి ఉండగా ఇప్పుడు రాష్ట్రం అంతటా అలముకొని ఉన్నది. ఉదా. మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల జరీ అంచు చీరలు 1995 నాటి వరకు ఆ ప్రాంతానికే పరిమితం, కాని ఇప్పుడు కర్నూలు జిల్లాలోని కోడూరు, ఎమ్మిగనురు, అనంతపురం జిల్లాలోని ముదిరెడ్డిపల్లె, ఒరిస్సాలోని

కటక్, చీరాల మొదలగు ప్రాంతాలలో తయారవుతూ నాణ్యత ప్రమాణాలను పాటించటం వలన గద్వాల ప్రాంత చేనేత వారికి మార్కెట్ సమస్య ఉత్పన్నమై తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. అంతేకాక ఈ జాతీయ జౌళి విధానం చేనేత రంగానికి రిజర్వ్ చేసిన కొన్ని రకాల ఉత్పత్తులను తొలగించాలనే సూచన మేరకు ప్రభుత్వం ఉదాశీన వైఖరితో పవర్‌లూమ్స్‌పై ఈ ఉత్పత్తులు తయారు చేయుటాన్ని నిరోధించేందుకు చట్టబద్ధమైన చర్యలు తీసుకోకపోవటం వలన చీరలు, లుంగీలు, షర్టింగ్, దోవతులు, కండువాలు, దుప్పట్లు మొదలగు ఉత్పత్తిరకాలను తయారు చేసే చేనేత వర్గం ధర్మవరం, వెంకటగిరి, గద్వాల్, పొందూరు, కుప్పడం లాంటి వాటిని డూప్లికేట్ చేస్తూ ఉన్నందున వారి జీవనోపాధి దెబ్బతినటమే కాక చేనేత కార్మికుల మధ్య ఒక వైరుద్యానికి దారితీసింది.

> ప్రపంచీకరణలో భాగంగా చేనేత కార్మికులందరూ మార్కెట్ పోటీకి నిలబడాలని, ఆ విధంగా తట్టుకొని నిలబడక పోతే చేనేత పరిశ్రమకు మనుగడేలేదని ఉద్ఘాటిసస్తూ మనరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సిహెచ్. విద్యాసాగర్ రావు ప్రకటనలిచ్చారు.

దీనిని బట్టి ప్రజాస్వామ్య దేశాలని చెప్పుకుంటున్న భారత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలవంతుడైన పవల్‌లూమ్ వాడిదే జౌళి రంగ రాజ్యం అన్నట్టుగా వ్యవహరిస్తూ చేనేత రిజర్వేషన్ హక్కును కాలరాస్తూ చేనేత కార్మికుల మధ్య వైరుధ్యాన్ని సృష్టించి కోట్లాది చేనేత కార్మికుల జీవితాలతో దోబూచులాడుతున్నారు.

## ఆంధ్రరాష్ట్రంలో చేనేత పరిశ్రమ

మన రాష్ట్రంలో 1995 హాండ్‌లూమ్ సెన్సెస్ ప్రకారం 3 లక్షల 9వేల 38 చేనేత కార్మికులు, 2,12,478 మగ్గాలపై పనిచేస్తున్నారని ప్రభుత్వం చెబుతుంది. 878 సహకార సంఘాలలో 2,49, 361 మంది సభ్యులు కలిగి 1,63,345 మగ్గాలపై పనిచేస్తున్నారని, ఈ రంగానికి కావలసిన ఋణ సౌకర్యాలను నాబార్డు ద్వారా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతుంది. అయినప్పటికి 120 కోట్ల రూపాయల ప్రభుత్వ గ్యారంటీ ఉన్నా కేవలం 30 కోట్లు రూపాయలు మాత్రమే 1999-2000 నాటికి ఆప్కో నాబార్డు ఋణాన్ని పొందగలిగింది. వాస్తవానికి ప్రభుత్వ లెక్కల ప్రకారం అయినా 250 కోట్ల రుపాయలు సహకార రుణం అవసరమయి ఉండగా 30 కోట్ల రుపాయలు మాత్రమే ఆప్కోకు అందించటం అనేది రాష్ట్ర ప్రభుత్వం యొక్క చేనేత రంగ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. 1998 మార్చినుండి 2001 ఏప్రిల్ 20 వరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు తీసుకొన్న వస్త్రాలకు చెల్లించవలసిన బకాయిలను ఇవ్వనందున రాష్ట్రంలోని 878 సొసైటీలలో ఇప్పటికే 300 సొసైటీలు గార్మెంట్ సొసైటీలు కాగా ప్రభుత్వం నుండి రావలసిన బకాయీలు రానందున 250 కోట్ల రుపాయలుపైగా వస్త్ర నిల్వలు పేరుకుపోయి సహకార బ్యాంకు నుండి తీసుకొన్న రుణాలకు వడ్డీలు చెల్లించలేక 400 సొసైటీలకు పైగా మూసివేయటానికి సిద్ధముగా ఉన్నవి. ఈ దశలో అనేక రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు చేసిన ఆందోళన, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో చేనేత కార్మికుల ఆత్మహత్యల ఫలితంగా ప్రభుత్వంపై సామాజిక వత్తిడి పెరిగి 26 కోట్ల రూపాయలు ప్రభుత్వ బకాయిలను చెల్లించిననూ ఇవి సహకార బ్యాంకుల వడ్డీ చెల్లింపులకు సరిపోతున్నాయి. నిస్సిగ్గుగా మనరాష్ట్రముఖ్యమంత్రి ఆప్కో షోరూములను, అమ్మి చేనేత బకాయిలను చెల్లించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు అసెంబ్లీలో ప్రకటించటం చేనేత రంగం పట్ల ప్రభుత్వ బాధ్యతను విస్మరిస్తూ లక్షలాది మంది కార్మిక వర్గాన్ని వీధుల పాలు చేస్తూ, సోద్యం చూసస్తున్నారు. అంతటితో ఆగక ప్రపంచీకరణలో భాగంగా చేనేత కార్మికులందరూ మార్కెట్ పోటీకి నిలబడాలని, ఆ విధంగా తట్టుకొని నిలబడకపోతే చేనేత పరిశ్రమకు మనుగడేలేదని ఉద్ఘాటిస్తూ మనరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సిహెచ్. విద్యాసాగర్ రావు ప్రకటనలిచ్చారు. దీనిని బట్టి మొదట నాపాదాలు నరికి వేసి పిదప నాకాళ్ళపై నిలబడుమంటున్నారు అన్న విధంగా చేతి వృతులు వాటంతట అవే నశించలేవు. వాటిని ఉద్దేశ్యపూర్వకంగానే నశింపచేశాయి. అని ఆచార్య వినోభాభావే చెప్పినట్లుగా ఉంది. దీనిని బట్టి హైటెక్ ముఖ్యమంత్రి గారికి చేతి వృత్తులపై జీవిస్తున పీడిత వెనుకబడిన కులాల వర్గంపై ఎంత నిర్లక్షమో,ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ. పరిశ్రమలు ఐదు నక్షత్రాల హోటళ్ళు వందల వేల కోట్ల రూపాయలతో నిర్మించే పారిశ్రామికవేత్తలకిచ్చే విద్యుత్ సబ్సిడీలు, ఉచితముగా భూములు, కోట్లాది రూపాయల వడ్డీ రాయితీలు బట్టి పారిశ్రామిక వేత్తలపై ఎంత ప్రేమో మనం అర్థం చేసుకోవాలి.

ఈ విషయాలన్నింటిని చేనేత కార్మిక వర్గం అయిన నేతకాని, జాంద్ర, పమిడి, కుర్ణి, కరుణబత్తుల, పట్టుశాలి, తొగట శాలి, గొల్లకుర్మ, పద్మశాలి, దేవాంగ, ఈడిగ మొదలగు కులాళవారు ఏ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికి, వర్గస్వభావంతో చేనేత సంక్షోభాన్ని గుర్తించి ప్రాంతీయ ఉత్పత్తులను రక్షించుకొనేందుకు చేనేత రిజర్వేషన్ ఉత్పత్తి రకాలను పవర్‌లూమ్స్ వారు తయారు చేయకుండా నివారించేందుకు సంఘటితశక్తితో సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు తలవొగ్గి ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి ప్రజావ్యతిరే విధానాలను రూపొందించి అమలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడందే పేద ప్రజల జీవిత మనుగడ లేదని గుర్తించి ఉద్యమించాలని కోరుతున్నాను.

- మాచర్ల మోహనరావు

# చేనేత కార్మికులకు మొండిచేయి చూపిన అఖిలభారత పద్మశాలి మహాసభ

'అఖిలభారత పద్మశాలి మహాసభ' జాతీయ సభలు మే 19,20 తేదీలలో హైదరాబాదులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగినాయి. గత మూడేళ్ళనుండి ఈ సభల నిర్వహణకు ప్రయత్నాలు ప్రారంభమై నాలుగు పర్యాయాలు తారీఖులు నిర్ణయించబడినా కులసంఘ నాయకత్వ వివాదం కోర్టులో నానడంతో వాయిదాల పర్వం మొదలైంది. చిట్టచివరికి సభల తేదీలు ఖరారు కావటం, సభలు ఎలా జరుగుతాయోననే సందేహం వెన్నాడిన నిర్వాహకులకు ఆశాభంగమే ఎదురుకావడం ఊహించినదే అయినా వివిధ గ్రామాలనుండి తరలివచ్చిన కుల నాయకులు, వేలాది మంది చేనేత కార్మికులకు నిరాశే ఎదురైంది.

మే 20 రోజున ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభకు కేంద్ర జౌళిశాఖామంత్రి కాశీరాం రాణా, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు హాజరు అవుతారని ప్రచారం చేయబడినా ఎవరూ రాలేదు. దీంతో నేతన్నలకు నిరాశే మిగిలింది. తమకు ముఖ్యమంత్రి వరాల వర్షం కురిపిస్తారని సగటు నేత కార్మికుడు భ్రమపడటం అందుకు ముఖ్యమంత్రి అసలే రాకపోవటం ఈ సభలోని ప్రత్యేకత. ఎందుకంటే పద్మశాలి సంఘం నాయకత్వం విషయంలో వ్యతిరేకతగా వున్న నాయకత్వం ఈ సభను విఫలం చేయుడానికి శతవిధాలా ప్రయత్నించింది.. ఈ సమహాసభల ఆహ్వాన సంఘం మరో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయను, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు ఎం. సత్యనారాయణరావును ఆహ్వానించినా వారు కూడా రాలేదు. ఇంకో ఈ సభలకు పార్లమెంట్ సభ్యులు ఏలె నరేంద్ర, రూమాండ్ల రామచంద్రయ్య, మాజీ సభ్యులు ఊర్వశి శారద, మాజీ మంత్రులు ఎల్. రమణ, ఘలివీరన్నలు మరియు ఎం.ఎల్.ఎ.లు ఎం. హనుమంతరావు, కొండా సురేఖలు కూడా హాజరు కాకపోవటం నేతన్నలకు ఆశ్చర్యం కలిగించింది. అసలు ఆహ్వాన సంఘం అధ్యక్షులు డి. విఠల్‌రావు సభలకు. ఎగనామం పెట్టడం మరీ వింత ధోరణి.

ఒకవైపు పద్మశాలి సభ రాజకీయ తీర్మాణంలో పద్మశాలి ప్రతినిధులను చట్ట సభలకు పంపాలని డిమాండు చేస్తుంటే వున్న ప్రతినిధులెవ్వరూ హాజరుకాకపోవటం పద్మశాలీల, నేతన్నల మనోభావాలను వారు ఖాతరు చేయలేకపోవడం కులం బలహీనతగానే చెప్పవచ్చు. కుల సంఘంలో తగాదాలుంటే పరిష్కరించుకోవాలి, లేదా స్వతంత్రంగా పని చేయాలి కాని నిర్వహించే సభలను చెడగొట్టడం వివేకవంతమైంది కాదని పలువురు నేతన్నలు వాపోయారు. అంతేకాదు ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు వహానం పాటించడం తప్ప ఆర్థికంగా ఆదుకుంటామని ప్రకటించకపోవటం కుల సంఘం బలహీనతనే చాటుతుంది.

ఇక కుల సంఘం వ్యవస్థ అలా వుంచితే వేలాదిగా తరలివచ్చిన నేత కార్మికుల సమస్యలను ప్రస్తావించేది పోయి వేదిక మీద పెద్దలంతా సభకు హాజరుకాని ముఖ్యమంత్రిని నిందించడానికి, నేతన్నలను నిరాశపర్చడానికే ఎక్కువ సమయం కేటాయించారు. సభకు మొత్తంగా ముఖ్యమంత్రినే సెంటర్‌పాయింట్ చేసి మాట్లాడటంతో సభ ఉద్దేశం దెబ్బతిన్నది. చేనేత కార్మికుల, మరమగ్గాల సమస్యలపై ప్రభుత్వంతో ఎటువంటి లాబీయింగ్ చేయాలి? ఎటువంటి పోరాటాలు నిర్మించాలి అనే వ్యూహను కూడా నేతన్నలకు కల్పించలేదు. నిజానికి వేదిక మీదనున్న వారంతా కుల నాయకులైతే వేదిక క్రిందవున్నవారు నేత కార్మికులు, మాస్టర్ వీవర్లు. దీంతో అసలు సమస్యలు వేదికమీద మాట్లాడకుండా కుల సమస్యనే నేతన్నల సమస్యగా చిత్రీకరించ ప్రయత్నం చేయటంతో మొదటి అరగంటలోనే సభకు హాజరైన సగం మంది బయటకు వెళ్ళిపోయారు. సభ ముగిసే సమయానికి వేయిమంది కూడా లేకపోవటం పరిస్థితిని తెలుపుతుంది.

గతంలో ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ నాయకత్వంలో తెలంగాణా పద్మశాలీలు అధిక సంఖ్యలో కదిలి ప్రభుత్వం విధానాలపై ప్రభావం చూపారు. నేడు నేతన్నలు తీవ్ర సంక్షోభంలో వుంటే వారిని కదిలించడంలో కాని, కదలివచ్చిన వారికి భవిష్యత్ వ్యూహాన్ని కాని అందించలేని దుర్భర పరిస్థితుల్లో నేడు పద్మశాలీ పెద్దలు కొట్టు మిట్టాడుతున్నారు. ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ మాటల్లో చెప్పాలంటే ప్రజాస్వామ్యంలో తమ హక్కుల సాధనకోసం ఉద్యమించనిదే ప్రభుత్వాలు దిగిరావని. ఇంతటి చారిత్రక సత్యాన్ని విస్మరించి నేటి కుల సంఘాలు కేవలం విజ్ఞాపనల ద్వారా తమ హక్కులను సాధించుకుంటామని భావించడం విడ్డూరంగానే వుంది. ఇంకా ముందుకు పోయి వేదికమీది నాయకులు ముఖ్యమంత్రిగారిని కలిసి సమస్యలు వివరించాలని, ఢిల్లీకి వెళ్ళి కేంద్ర జౌళిశాఖా మంత్రిని కలుస్తామని వివరణ ఇవ్వడంలో పసలేదు.

ఒక అఖిల భారతస్థాయి సంఘం వేలాది ప్రజలముందు తమ సమస్యలను చెప్పుకుంటామని తెలిపినపుడే హాజరుకాని బాధ్యతగల నాయకులు, ప్రతినిధి బృందం వెళ్ళి విన్నవిస్తే స్పందిస్తారనటం ఒట్టిమాటే.

మనరాష్ట్రంలో ఇప్పటికి 80 మంది చేనేత/నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కనీసం పరామర్శించే స్పృహలేని ముఖ్యమంత్రి నేతన్నల సంక్షోభంపై సానుకూలంగా స్పందిస్తారని ఆశపడటం అత్యాశే అవుతుంది. 1991 నేతన్నల ఆత్మహత్యల పరంపరలో చీరాలలో ఉద్యమించిన నేతన్నల సమస్యలను తెలుసుకునేందుకు కేంద్రమంత్రులే దిగివచ్చారు. ఈ సందర్భంగా నేతన్నలు అవగాహన చేసుకోవాల్సిందేమంటే ఉద్యమాలు చేయందే, వేలాదిగా, లక్షలాదిగా ప్రజలు కదలందే ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో నేతన్నలకు న్యాయం జరగదని గ్రహించి అటువంటి ఉద్యమ పథాన్ని అందిస్తున్న కార్మిక సంఘాల నాయకత్వంలో ముందుకు సాగాలనే స్పృహను నేతన్నలు పెంపొందించుకోవాలి. అప్పుడే తమ హక్కుల సాధన సాధ్యమవుతుంది.

-తడ్క యాదగిరి

# క్షమార్హం కాని ప్రకటనలు - విధానాలు

రాష్ట్రప్రభుత్వంలో గౌరవ మంత్రి పదవులు వెలగబెడుతున్న వారు చేనేత కార్మికులపట్ల క్షమార్హంకాని ప్రకటనలు చేయటం జరిగింది. ఇది ప్రజాస్వామ్యంలో అవాంఛనీయమైంది. ఒకమంత్రి నేతన్నలకు ఆత్మస్థైర్యం లేదు, సామర్థ్యం లేదు అంటే, మరో మంత్రి లక్షరూపాయల ఎక్స్‌గ్రేషియా కోసమే నేతన్నలు ఆత్మహత్య చేసుకుంటున్నారని నోరు పారేసుకోవటం క్షమార్హం కాని ప్రకటనలు. ఎందుకంటే చేనేత, మరమగ్గాల సంక్షోభ తీవ్రతను అర్థం చేసుకోలేని వీరు తమకు తోచింది మాట్లాడటం ఈ ప్రజాస్వామ్యం వ్యవస్థ దయనీయ దుస్థితినే తెలుపుతుంది. ఇంతకాలం నేతన్నలు మనుగడ సాగించారంటే అది కేవలం వారి సామర్థ్యం, నైపుణ్యతలతోనని ఏ ఆర్థికవేత్తను అడిగినా చెబుతారు. ఇక ఎక్స్‌గ్రేషియా విషయం హాస్యాస్పదమైంది. 1998లో 300మంది పత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకుంటే నష్టపరిహారం చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం తమకు చెల్లిస్తుందని ఊహించి నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పడం బాధ్యతారహితమైన, తప్పుదోవ పట్టించే ప్రకటనలు గానే భావించాల్సివుంటుంది. ఒకరకంగా నేతన్నలను పరిహసించటమే అవుతుంది. ఇప్పటివరకు 80 మంది నేతన్నలు ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురైతే ఆ కుటుంబాలను పరామర్శించడానికి తీరికలేని హైటెక్ ముఖ్యమంత్రి సినిమా ఉత్సవాలలో పాల్గొనేందుకు తీరిక దొరకటం విడ్డూరంగా కనిపిస్తుంది.

ఈ విషయాలిలా వుంటే మొన్నటి వరకు కమ్యూనిస్టు యోధుడుగా కీర్తించబడ్డ సి.హెచ్. రాజేశ్వరరావు నేతన్నలకు ఎయిడ్స్‌వుందని ప్రకటించడం మరీ తీవ్రమైంది. స్వచ్ఛంద సంస్థలలో సంబంధాలున్న ఆయన శవరాజకీయం చేసి పబ్బంగడుపుకోవాలని చూడటం క్షమించరాని నేరంగా నేతన్నలు పరిగణించి ప్రతిఘటించాల్సి వుంది.

మరోవైపు నేతన్నల కుటుంబాలకు సిరిసిల్లలో భోజన శిబిరాలు నిర్వహించటం వారిని బిచ్చగాళ్ళుగా తయారు చేయటమే అవుతుంది. సమస్యను పరిశీలించి పరిష్కార మార్గాలవైపు దృష్టి సారించాల్సిన రాజకీయపార్టీలు తాత్కాలిక ప్రయోజనాలకోసమే ప్రయత్నిస్తుండటాన్ని చరిత్ర క్షమించదు. ☆

# నేతన్నల ఆత్మహత్యలపై లోక విద్యావేదిక సదస్సు

రాష్ట్రంలో చేనేత కార్మికులు, మరమగ్గాల కార్మికుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్న క్రమంలో మార్చి చివరివారంలో లోకవిద్యా ఆందోళన వేదిక (ఆంధ్రప్రదేశ్) మరియు స్వతంత్ర చేనేత పరిశోధనా బృందం సభ్యులు సిరిసిల్ల, దుబ్బాకలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ బృందం తమ అనుభవాలను కార్మికులు, నాయకులు, మేధావులతో పంచుకునే ఉద్దేశంతో ఏప్రిల్ 17న సాయంత్రం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని మినీహాల్‌లో ఒక సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సుకు డాక్టర్ ఎం. చెన్నబసవయ్య అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ కేశవరావ్ జాదవ్, ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు, కె.జె. రామారావులు తమ అవగాహనను వెల్లడించారు. ఇంకా ఈ సదస్సుకు హాజరైన చేనేత కార్మిక సంఘం కార్యదర్శి నీలం పండరి, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కార్యదర్శి కె. శాంతారావు తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్త పర్చారు. సదస్సు చివరలో రాష్ట్రచేనేత కార్మిక సమాఖ్య అధ్యక్షులు మాచర్ల మోహనరావు వివిధ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. దుబ్బాక - సిరిసిల్ల సంక్షోభాల మధ్య వైరుధ్యం వుందని, ఈ వైరుధ్యాన్ని గుర్తించకుండా రాజకీయ పార్టీలు, మీడియా చేనేత సమస్యలుగా చిత్రీకరిస్తుందని మోహన్‌రావు అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో 50 మంది ప్రముఖులు పాల్గొన్నారు. తడ్కయాదగిరి కృతజ్ఞతలతో సదస్సు ముగిసింది.

# కొత్త సీసాలో పాత మందు

# దీన్‌దయాల్ హాత్‌కార్ ఘా యోజన పథకం

కేంద్రంలో అధికారంలోవున్న ప్రస్తుత ఎన్.డి.ఎ ప్రభుత్వం చేనేతరంగం అభివృద్ధికి ఉద్దేశించిన ఒక పథకాన్ని దీన్‌దయాల్ హాత్ కార్‌ఘా యోజన పథకం పేరుతో 1999-2000 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి యశ్వంత్‌సిన్హా ప్రకటించారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన చర్యలు ఇందులో ఉన్నాయి. ఈ పథకం తొమ్మిదో పంచవర్ష ప్రణాళికా కాలంలో రెండేళ్ళు, పదో పంచవర్ష ప్రణాళికా కాలంలో ఐదేళ్ళు అమలులో ఉంటుంది. గతంలో వున్న వివిధ పథకాలన్నింటిని క్రోడీకరించి పథకం పేరును మార్చినట్లుగానే కనిపిస్తుంది. అందుకే ఈ పథకం కొత్త సీసాలో పాత మందు చందంగా భావింపబడుతుంది. ఈ పథకంలో కార్మికులకు రుణసౌకర్యం డిజైన్ స్కిల్స్, డైహౌజెస్, ఎగ్జిబిషన్లు, పబ్లిసిటీ, మార్కెటింగ్ మరియు వెబ్‌సైట్ సౌకర్యం మొదలైనవి అనేకం ఉన్నాయి.

గతంలో 1953లో అప్పటి జౌళిశాఖామంత్రి జి. వెంకటస్వామి ప్రకటించిన 1830 కోట్ల రూపాయల పథకాలలో సగంకూడా అమలు చేయబడలేదు. అటువంటిది ప్రస్తుత ఎన్.డి.ఎ. ప్రభుత్వం నామమాత్రంగా ప్రకటించిన పథకం క్రిందిస్థాయి నేతన్నలకు ఎంతమేరకు ఉపయోగపడుతుందో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఎందుకంటే జిల్లాస్థాయిలోని జౌళిశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలేవీ సరిగా అమలు చేయబడటం లేదు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఈ పథకాలు నీరుగారిపోతున్నాయి.

1995-96 చేనేత మగ్గాల లెక్కల ప్రకారం దేశంలో 27శాతం నేత కార్మికులు సహకార రంగంలో వుండగా, 73 శాతం కార్మికులు సహకారేతర ప్రయివేటు రంగంలో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం అమలుపర్చిన పథకాలన్ని సహకార రంగంలోని వారికి ఉద్దేశించినవే. ఈ పథకాల అమలులో అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి. సహకార సంఘాల నాయకత్వం స్వార్థపూరిత విధానాలు, బినామీ పేర్లతో పథకాల ప్రయోజనాలు పొందటంతో చేనేత కార్మికులకు అన్యాయం జరిగింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో సహకార సంఘాలలోని నేతన్నలకు ప్రభుత్వం గుర్తింపు కార్డులిచ్చింది. కాని సహకారేతర రంగంలోని కార్మికులకు ఇంతవరకు గుర్తింపు కార్డులివ్వలేదు. ప్రస్తుత కొత్త పథకం అన్ని రంగాల కార్మికులకు వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతుంది. ఒకవేళ సహకారేతర రంగంలోని వారికి గుర్తింపు కార్డులిచ్చినా ఈ పథకాలు నిష్పక్షపాతంగా అమలు పర్చే యంత్రాంగం ఒక్కో జిల్లాలో 6 నుంచి 10 లోపే వుంది. మరోవైపు ప్రస్తుతం వున్న సహకార సంఘాలను గుర్తించేదిలేదని, ప్రతి ఒక్కరు తమ సొంత కాళ్ళపై నిలబడాలని ప్రభుత్వం చెబుతుంది. 25 మంది నేతన్నలు ఒక సంఘంగా ఏర్పడితే వారిని గుర్తిస్తామంటున్నారు. ఇదంతా నేతన్నల మధ్య తగాదాలు సృష్టించడానికి అవకాశమిస్తుంది. పాలకులు తమ పబ్బం గడుపుకోవడానికి ఇలాంటి పథకాలను ఎరగా వాడుతున్నారనే స్పృహను నేతన్నలు కలిగివుండాలి. ఇంతా చేస్తే ఈ పథకం క్రింద రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా రాలేదన్నది నగ్న సత్యం.

కాబట్టి నేతన్నలు సంక్షేమ పథకాల ద్వారానే ప్రయోజనం పొందుతామనే అపోహలనుంచి బయటపడి చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న మౌళికమైన నూలు రంగులు, రసాయనాలు మరియు మార్కెటింగ్ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాల్సిన అవశ్యకతను గుర్తించాలి.

- డి. కల్పనకుమారి

'కాలం పరీక్షలకు తట్టుకొని చేనేత పరిశ్రమ నిలువగలిగింది. ఇకముందుకూడా నిలువగలుగుతుంది. వికేంద్రీకృతమైన ఆధునిక ఆర్థిక వ్యవస్థకు పునాదిగా దీనిని పటిష్టం చేయవలసిన అవసరం ఎంత గానో వుంది.'

- థామస్ కమిటి (1942)

'చేనేత పరిశ్రమ మరమగ్గం పోటీకి తట్టుకొని ఇంతకాలం బ్రతికి ఉండటాన్ని కళాత్మకమైన శక్తులు ఎన్నటికీ నాశనం కాలేవనేది స్పష్టమవుతుంది.'.

- లూథర్ హూవర్

ఈ మాసపు కవిత

# "సమాధులకీ భాష వుంది"

బ్రతుక్కే కాదు
చావుకీ భాష వుంది
చావుకన్నా నిర్దయంగా
మారేదీ మాట్లాడలేదు!?

శరీరానికి ఆకలెంత అవసరమో
తీరటమూ అంతే
పోతూ పోతూ ఆకలి
ప్రాణాల్ని తెంపుకుపోవటమే విచారకరం!

ఆరుగజాల చీరని
అగ్గిపెట్టెలో అదుముకున్నా
ప్రకృతినెంతగా ప్రతిబింబించినా
ఆచేయి కేమీ మిగల్లేదు

ఇంకా పూర్తికాని అరనిద్రలో లేచి
పాకోళ్లనెంత తొక్కుకున్నా
కడుపు వెన్నంటుకున్నా
సత్తువలేని భుజాలతో పలకచుట్టుకున్నా
నిండేవి కడుపులా? కాళ్లా?!
పోగుమీద చూపుల్ని నిలుపుకుని
అరసమాధిలో
వస్త్ర తపస్సు చేసినా
కోరికలు తీరేనా?

బలపాన్ని పట్టుకునే చిన్నతనం నుంచీ
ముక్కాలి ముసలితనం దాకా
బ్రతుకు మగ్గం గుంటలో దిగబడాల్సిందే

తరాలుగా వెక్కిరిస్తున్న తలరాతలు
బాధ్యతగా నెత్తికెక్కిన బాధలు
అస్త్రాలై గుచ్చుకునే అప్పులు
ఎప్పటికప్పుడు చురుక్కుమనిపిస్తూనే
మగ్గం చుట్టూ తిప్పుకుంటాయి.

కండెల్ని చుట్టుకున్న కండలు కరిగితేనేం?
నాడెవెంట పరుగెత్తి చూపులు మసకబారితేనేం?
అకాల వృద్ధాప్యంతో నడుం వొంగిపోతేనేం?

చివరకు
నిలువునీ పేకనీ కప్పుకోలేక
అస్థిపంజరమై మగ్గమే తెల్లబోతేనేం?
ఎవరిక్కావాలి?

జీవనాడిలా మొగ్గం పెనవేసుకుపోయింది
మగ్గాన్ని విడవడమంటే
జీవితాన్ని విడవడమే!

దేశీయ విదేశీయం
మగ్గాన్నెప్పట్నుండో మింగేస్తోనే వుంది
నేసేందుకేమీ లేనప్పుడు
మగ్గం సైతం కేవలం కట్టెల పోగే!

అసలే-
గాల్లో దీపాలు
గ్లోబల్ తుఫానుల్ని తట్టుకుంటాయా?
ఆకలి కేకలిప్పుడు
హైటెక్కుల నటబధిరాంధులకి చేరతాయా?

ఏ చావో సమస్యని వెలిగించ లేనప్పుడు
ఎదిరించడానికి చావుతప్ప
నేతన్నకి ఆయుధమేది?
అరసమాధి బ్రతుకులు
నిండు సమాధులవుతున్నాయి!
వినగలగాలే కాని,
సమాధులకీ భాష వుంది!!

- పున్న సుదర్శన్




"పోరాటమే పరిష్కారం" అని రాష్ట్ర చేనేత కార్మిక సమాఖ్య నేతన్నలకు ఇస్తున్న పిలుపు



నల్లగొండ జిల్లా చేనేత కార్మిక మహాసభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు



చేనేత కార్మికుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా పాటల ద్వారా కళాసమితి ప్రచారం చేస్తున్న సమాఖ్య కార్యకర్తలు



చేనేత కార్మికులతో చర్చలు జరుపుతున్న సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల మోహన రావు

Printed, Published & Owned by Macherla Mohana Rao, Printed at Planographers, Chirag Ali Lane, Hyderabad - 1.
and Published at Hyderabad, H.No.16-9-32/A/1, Old Malakpet, Hyderabad - 500 036.